


బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయండి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కోరుకంటి చందర్

గోదావరిఖని, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ పిలుపునిచ్చారు. సోమవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నీరు, నిధులు, నియామకాల్లో జరుగుతున్న అన్యా యాలకు వ్యతిరేకంగా 25 ఏళ్ల క్రితం తెలం గాణ రాష్ట్ర సమితి ఆవిర్భవించిం దన్నారు. కేసీఆర్ ఆధ్వర్యంలో స్వరాష్ట్రం కోసం అలు పెరుగని పోరాటాలు చేసిందన్నారు. మిలియన్ మార్చ్, సకల జనుల సమ్మెతో కేంద్రాన్ని కదిలించిందన్నారు. రాష్ట్రం ఏర్పడిన తరువాత తెలంగాణ పునర్ నిర్మాణంలో భాగంగా టీఆర్ఎస్, బీఆర్ఎస్‌గా ఆవిర్భవిం చిందన్నారు. ప్రతి గడపకు సంక్షేమ పథకాలు అందించాలనే లక్ష్యంతో అనేక విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చిందని, రైతులకు, బడుగు, బలహీనవర్గాలకు, దళితులకు ఎన్నో పథకాలు ప్రవేశ పెట్టిందన్నారు. దేశంలోనే తెలంగాణను అగ్రగామి రాష్ట్రంగా నిలిపిన ఘనత కేసీఆర్‌దన్నారు. ఎల్కతుర్తిలో ఈ నెల 27న జరుగనున్న రజతోత్సవ సభలో కేసీఆర్ తెలంగాణ ప్రజలకు భవిష్యత్ గుర్తించి దిశా నిర్దేశం చేయనున్నారని, ప్రజలు హాజరై విజయవంతం చేయాల న్నారు. నాయకులు మెతుకు దేవరాజ్, కుమ్మరి శ్రీనివాస్ పాల్గొన్నారు.



ప్రభుత్వ పాఠశాలల్లో ఏఐ బోధన

- జిల్లాలో 20 పాఠశాలల గుర్తింపు
- మార్చి 15 నుంచి మొదలైన కృత్రిమ మేథ పాఠాలు
- ప్రాథమిక దశలో విద్యార్థుల సామర్థ్యాలు పెంచడమే లక్ష్యం
- వచ్చే విద్యా సంవత్సరం మరిన్ని పాఠశాలల్లో అమలు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

ప్రస్తుతం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రపంచాన్ని శాసిస్తున్నది. అన్నిరంగాల్లో ఏఐ వినియోగం అనివార్యమైంది. ఇప్పుడు తాజాగా ప్రభుత్వ పాఠశాలల్లో కూడా ఏఐని ప్రవేశపెట్టారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో యేటా అభ్యసన సామర్థ్యాలు తగ్గిపోవడం గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు చేపట్టింది. విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పెంపొందించేందుకు కృత్రిమ మేథ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ముందుగా ప్రాథమిక పాఠశాలల్లో చదివే వారిలో అభ్యసన సామర్థ్యాలు పెంపొందించేందుకు ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) సాయంతో పాఠాలు బోధించడం ప్రారంభించారు. విద్యార్థులు తెలుగు బాగా చదవడం, గణిత అంశాల్లో పట్టు సాధించేలా కృత్రిమ మేథ సాయంతో ఆకట్టుకునే విధంగా పాఠ్యాంశాలను రూపొందించారు. జిల్లాలో ప్రయోగాత్మకంగా 50 మందికి పైగా విద్యార్థులు గల 20 ప్రాథమిక పాఠశాలలను గుర్తించారు. వీటిని పర్యవేక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం బెంగళూరుకు చెందిన ఏక్-స్టెప్ సంస్థతో ఒప్పందం చేసుకుంది.

తమిళనాడు రాష్ట్రంలో విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంపొందించేందుకు చేపట్టిన కార్యక్రమం సత్ఫలితాలు ఇస్తుండడంతో మన రాష్ట్రంలో కూడా కృత్రిమ మేథ (ఏఐ) సాయంతో విద్యా బోధన ప్రారంభించారు. వచ్చే విద్యా సంవత్సరంలో ఏఐని ఒక సబ్జెక్టుగా ప్రవేశ పెట్టి క్రమంగా 50 మంది వరకు గల మరిన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో విద్యాబోధన ఆరంభించాలని ప్రభుత్వం భావిస్తున్నది.

జిల్లాలో 20 పాఠశాలల గుర్తింపు..

జిల్లాలో 20 ప్రాథమిక పాఠశాలలను ఎంపిక చేశారు. ఇందులో జూలపల్లి మండలం తేలుకుంట, మంథని మండలం కన్నాల, ఎక్లాస్‌పూర్, మంథని బాలికల పాఠశాల, రామగుండం మండలంలోని గాంధీ పార్కు ఉర్దూ మీడియం పాఠశాల, తెలుగు మీడియం పాఠశాల, మల్యాలపల్లి, రామగుండం పాఠశాలలు, కాల్వశ్రీరాంపూర్ మండలం గంగారం, పెద్దపల్లి మండలం మారేడుగొండ, రంగాపూర్, ఎలిగేడు మండలం సుల్తాన్‌పూర్, పాలకుర్తి మండలం కన్నాల, బసంత్‌నగర్, ఓదెల మండలం కొలనూర్, ధర్మారం మండలం కొత్తూర్, నర్సింహులపల్లి, ముత్తారం మండలం ఖమ్మంపల్లి, అంతర్గాం మండలం అంతర్గాం టీటీఎస్, రామగుండం మండలం నాగేపల్లి పాఠశాలలు ఉన్నాయి. ఏఐ బోధించేందుకు పలువురు ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. ఫండమెంటల్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్) ప్రకారం ఒకటో తరగతి నుంచి 5వ తరగతి విద్యార్థులకు మార్చి 15వ తేదీ నుంచి విద్యాబోధన మొదలు పెట్టారు.

విద్యాసామర్థ్యాలు పెంచడమే లక్ష్యం..

ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో చదివే విద్యార్థుల్లో చదవడం, రాయడం గణితం సరిగా చేయక పోవడం వంటివి జరుగుతున్నాయి. అలాంటి విద్యార్థుల కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను ఉపయోగించి విద్యా సామర్థ్యాలను పెంపొందించడానికి ఏఐ ద్వారా విద్యా బోధన చేస్తున్నారు. ముఖ్యంగా వెనకబడిన విద్యార్థులు ఈ టూల్స్‌ను ఉపయోగించుకొని స్వయంగా విద్యార్థులే తెలుగు, ఇంగ్లీష్ భాషలో అక్షరాల గుర్తింపు, సరళ పదాలు, వారి స్థాయిని బట్టి పదాలను చదవడం, రాయడం, గణితంలో సంఖ్యలు రాయడం, కూడిక నుంచి మొదలుకొని భాగాహారం వరకు విద్యార్థులు స్వయంగా నేర్చుకోవడానికి ఏఐ దోహదపడుతుంది. దీని ద్వారా విద్యార్థుల్లో ఆసక్తి పెరిగి ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా చక్కగా నేర్చుకోవడానికి అవకాశం ఉంటుంది. వీటికి తోడుగా ఎఎక్సెల్ పేరుతో ఇంటెలిజెన్స్ విద్యను అందించనున్నారు. ఫస్ట్ లెవెల్లో డిస్కవరిలో ఏఐ పిల్లల శక్తి సామర్థ్యాలు తెలుసుకునేందుకు కొన్ని ప్రశ్నలు అడుగుతుంది. దృశ్య, శ్రవణం ద్వారా జవాబు కూడా చెబుతుంది.

మిగతా 8వ పేజీలో..

ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి



ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): వివిధ సమస్యలతో ప్రజావాణికి వచ్చే వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని, దరఖాస్తులు పెండింగ్‌లో ఉండకుండా చూడాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ఆయన దరఖాస్తులను స్వీకరించారు. కమాన్‌పూర్ మండలానికి చెందిన కల్వల జయ తనకు కాగజ్‌నగర్‌లో ఉన్న రేషన్ కార్డును కమాన్‌పూర్ మార్చాలని దరఖాస్తు చేసుకున్నారు. సుల్తానాబాద్ పట్టణానికి చెందిన సీహెచ్ శ్రీమన్నారాయణ తండ్రి పేరు మీద ఉన్న స్థలం క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోగా నిషేధిత స్థలం అని వస్తుందని, మా స్థలం ఉన్న ప్రాంతంలో చుట్టూ ఇళ్లు ఉన్నాయని, క్రమబద్ధీకరణ చేయాలని కలెక్టర్‌ను కోరారు. గోదావరిఖని పట్టణానికి చెందిన జీఆర్ ప్రసాద్ 49వ డివిజన్‌లో రోడ్డును ఆక్రమిస్తూ ప్రహరీ నిర్మాణం జరుగుతుందని, దీనిని తొలగించాలని దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తు దారుల సమస్యల విన్న కలెక్టర్ సంబంధిత అధికారులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజావాణిలోనే గాకుండా, తమ వద్దకు నేరుగా వచ్చే దరఖాస్తులను కూడా సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. అదనపు కలెక్టర్ డి వేణు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే



విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

అంతర్గాం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): రామగుండం పట్టణంలోని 20వ డివిజన్ ఏరియాలో గల గురుకుల పాఠశాలను సోమవారం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ సందర్శించారు. ఎమ్మెల్యే పాఠశాల ప్రాంగణాన్ని సందర్శించి అక్కడ విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేస్తూ విద్యాబోధన తీరు, భోజనం ఎలా ఉందని తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. ఏదైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఎమ్మెల్యే అంతర్గాం మండల పరిధిలోని ముర్మూర్, మొగల్ పహడ్ గ్రామంలో సన్నబియ్యం పంపిణీ ప్రారంభించి మాట్లాడారు. పేదల కడుపు నింపడానికే రేవంత్‌రెడ్డి సన్నబియ్యం పంపిణీ చేస్తున్నారని పేర్కొన్నారు. తహసీల్దార్లు తూము రవీందర్ పటేల్, కుమారస్వామి, ఎంపీడీఓ వేణు, ప్రిన్సిపాల్ కొప్పుల మాధవి, కాంగ్రెస్ నాయకులు మహంకాళి స్వామి, శేఖర్, నారాయణ, రజిత, సునీత, కమల, జ్యోతి,శ్రీనివాస్ పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఉత్తమ ర్యాంకు సాధించాలి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ అరుణశ్రీ

కోల్‌సిటీ, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ సర్వేక్షణ్‌లో రామగుండం నగరం ఉత్తమ ర్యాంకు సాధించేందుకు పౌర స్పందనలో ఫీడ్ బ్యాక్ ఇవ్వాలని అదనపు కలెక్టర్, రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ జే అరుణశ్రీ కోరారు. ఈ మేరకు మెప్మా ఆర్‌పీలతో సోమవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో పౌర స్పందనకు ఎక్కువ మంది ఫీడ్ బ్యాక్ ఇస్తే మార్కులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉంటుందన్నారు. ఆన్‌లైన్‌లో ఫీడ్ బ్యాక్ నమోదు చేయడానికి మరో నాలుగు రోజులు గడువు ఉన్నందున స్వశక్తి మహిళలకు అవగాహన కల్పించి ప్రోత్సహించాలన్నారు. డిప్యూటీ కమిషనర్ వెంకట స్వామి, సానిటరీ ఇన్‌స్పెక్టర్ కుమారస్వామి, మెప్మా టీఎంసీ మౌనిక, సీఓలు, ఆర్‌పీలు పాల్గొన్నారు.

నీరు లేని చలివేంద్రం



పెద్దపల్లి రూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): రాంపల్లి బస్ షెల్టర్‌లో పంచాయతీ కార్యదర్శి చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అయితే కుండలో నీరు లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు గ్రామ పంచాయతీ పరిధిలో రెండు కుండలతో చలివేంద్రాన్ని ఏర్పాటు చేయాలని అధికారులు ఆదేశించారు. ఒక ఫ్లెక్సీపై చలివేంద్రం అని చేతి రాతతో రాసి ఒక కుండ పెట్టాడు. అందులో చుక్క నీరు లేని ఓ కుండను ఏర్పాటు చేసి అధికారుల ఆదేశాలను పాటించినట్లుగా ఏర్పాటుచేశారు. చలివేంద్రం పరిస్థితిని చూసిన వారంతా ఖాళీ కుండను చూసి వెళ్లిపోతున్నారు.



అద్దె ఇంట్లో కొనసాగుతున్న సూరయ్యపల్లి కార్యాలయం

పంచాయతీలకు భవనాలు లేక ఇక్కట్లు

- అసంపూర్తిగా భవన నిర్మాణాలు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు

7

మాతా శిశు మరణాల నియంత్రణకు కృషి

- ఘనంగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవం
- ర్యాలీలు, అవగాహన సదస్సులు

8



ఎన్టీపీసీ ర్యాలీలో పాల్గొన్న సిబ్బంది

సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలి

- విద్యుత్‌శాఖ ఎస్ఈ మాధవరావు

పెద్దపల్లి టౌన్/రూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులకు సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని విద్యుత్ శాఖ ఎస్ఈ మాధవరావు అన్నారు. సోమవారం రాఘవపూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని సమావేశ మందిరంలో వివిధ విభాగాల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎస్ఈ మాధవరావు మాట్లాడుతూ విద్యుత్ డిమాండ్ రోజురోజుకు పెరుగుతుందని, వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరాలో చేపట్టాల్సిన పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. సరఫరాలో సమస్యలు తలెత్తిన వెంటనే పునరుద్ధరించాలని సిబ్బందిని ఆదేశించారు. ముందస్తుగా లోడ్ పెరిగే ట్రాన్స్‌ఫార్మర్‌లను గుర్తించి కొత్తగా ట్రాన్స్‌ఫార్మర్‌లు, ట్రాన్స్‌ఫార్మర్‌ల సామర్థ్యం పెంచాలని, వినియోగదారులకు ప్రత్యామ్నాయ లైన్ ద్వారా విద్యుత్ సరఫరా చేసేందుకు కొత్తగా ఇంటర్ లింకింగ్ లైన్‌ల ఏర్పాటు పూర్తి చేయాలన్నారు. గత ఆర్థిక సంవత్సరం రెవెన్యూ కలెక్షన్స్‌లలో కంపెనీ పరిధిలో 16 సర్కిల్‌లలో మొదటి స్థానం వచ్చినందుకు అధికారులు, సిబ్బందిని అభినందించారు. వ్యవసాయ కనెక్షన్ మంజూరు త్వరగా చేయడంలో మొదటి స్థానం వచ్చిందని, దానిని అలాగే కొనసాగించాలన్నారు. రైతులకు అందుబాటులో ఉంటూ వెంటనే వ్యవ సాయ కనెక్షన్ మంజూరు చేయాలని ఆదేశించారు. ఏడీ, డీఈ, ఏఈలు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని జీపీ కార్మికుల సమ్మె నోటీస్

ఓదెల, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సోమవారం జీపీ కార్మికులు ఎంపీడీవో తిరుపతి, ఎంపీవో షబ్బీర్‌పాషకు సమ్మె నోటీస్ అందజేశారు. గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ ఎండి.ఖాజా మాట్లాడుతూ జీపీ కార్మికులు 40 ఏళ్లుగా పంచాయతీలకు సేవలు అందిస్తున్నా కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత లేదన్నారు. రాష్ట్రంలో ఏ ప్రభుత్వం వచ్చినా ప్రతీ నెల వేతనాలు కార్మికులకు చెల్లించలేని పరిస్థితి నెలకొంటుందని తెలిపారు. జనవరి నుంచి గ్రీన్ ఛానల్ ద్వారా వేతనాలు చెల్లిస్తామన్నా సీఎం హామీ నెరవేరలేదన్నారు. కనీస వేతనాలు అమలు చేస్తామని, మల్టీపర్పస్ వర్కర్స్ విధానాన్ని రద్దు చేసి ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చారన్నారు. గత ప్రభుత్వ విధానాలనే కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తుందని తెలిపారు. సమస్యలు పరిష్కరించకుంటే ఈనెల 19 తరువాత నిరవధిక సమ్మె చేపడుతామన్నారు నాగయ్య, ఆకుల నరేష్, సదానందం, పవన్, తిరుపతి, ప్రభాకర్, పాల్గొన్నారు.


రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత



పాదయాత్ర చేస్తున్న పటేల్ రమేష్‌రెడ్డి, ఎమ్మెల్యే విజయరమణారావు

సుల్తానాబాద్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత అని ఎమ్మెల్యే విజయ రమణారావు అన్నారు. జైబాపు, జైభీం, జైసంవిధాన్ నినాదంతో కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం పిలుపు మేరకు ఐతరాజుపల్లి నుంచి భూపతిపూర్ వరకు సోమవారం రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే పాదయాత్ర నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ డాక్టర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగానికి ముప్పు తెచ్చే విధంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలు రిజర్వేషన్లకు ముప్పు వాటిల్లే విధంగా ఉన్నాయన్నారు. నల్లధనం వెలికి తీసి జన్ దన్ ఖాతాల్లో డబ్బులు జమచేస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చి నయా పైసా వేయలేదని పేర్కొన్నారు. కులాలు, మతాల మధ్య విభేదాలు సృష్టించి పబ్బం గడుపుకోవడమే బీజేపీ విధానమన్నారు. కాంగ్రెస్ పార్టీ ఉపాధిహామీ పథకాన్ని తీసుకువచ్చి ఎంతోమంది పేదల కడుపులు నింపుతున్నదని అన్నారు. రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్, కార్యక్రమ నియోజకవర్గ ఇంచార్జి పటేల్ రమేష్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంగా పేరుగాంచిన భారతదేశంలో రాజ్యాంగాన్ని మార్చేందుకు కేంద్రం కుట్రలు పన్నుతోందని విమర్శించారు. కేంద్రం కుట్రలను ప్రజలకు వివరించేందుకు రాహుల్‌గాంధీ గ్రామ గ్రామాన పాదయాత్ర చేపట్టాలని నిర్దేశించారని చెప్పారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, వ్యవసాయ మార్కెట్ చైర్మన్లు ఈర్ల స్వరూప, మినుపాల ప్రకాష్ రావు, తిరుపతి రెడ్డి, గండు సంజీవ్, మాజీ జడ్పీటీసీ సారయ్య గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిలుక సతీష్, సామ రాజేశ్వర్ రెడ్డి, మూల ప్రేమ్ సాగర్ రెడ్డి, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యుఐ నాయకులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అసంపూర్తిగా ఇళ్ల నిర్మాణాలు



- డబుల్ బెడ్‌రూం ఇండ్ల కోసం తొమ్మిదేళ్లుగా ఎదురుచూపులు
- 2016లో లబ్ధిదారుల ఎంపిక
- సర్వే నంబర్ 779లో ఇళ్ళ నిర్మాణం
- కొన్ని స్లాబ్‌ల వరకు, మరికొన్ని పిల్లర్ల వరకు

బీఆర్ఎస్ హయాంలో పేదలకు డబుల్ బెడ్‌రూం ఇండ్లు నిర్మిస్తామని హామీ ఇచ్చింది. ఈ మేరకు దరఖాస్తులు ఆహ్వానించి లక్కీడ్రా ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేశారు. అరకొర నిధులు కేటాయించడంతో కాంట్రాక్టర్ పనులను అర్ధంతరంగా వదిలివేశారు. దీంతో సొంత ఇంటి కల సాకారం కోసం తొమ్మిదేళ్ళు ఎదురుచూస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వమైనా నిధులు కేటాయించి ఇంటి నిర్మాణాలు పూర్తిచేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

సుల్తానాబాద్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల నిర్మాణం ఎప్పుడు పూర్తి చేస్తారు.. ఎపుడు కేటాయిస్తారంటూ లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన డబుల్‌బెడ్ రూమ్ ఇండ్ల పథకంలో భాగంగా 2016లో సుల్తానాబాద్ పట్టణంలోని అర్హులైన లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. రెండు వందలకు పైగా దరఖాస్తులు రాగా అధికారుల డ్రా తీసి మొదటి విడతగా ఎనభై మందిని ఎంపిక చేశారు. అనంతరం ప్రభుత్వం ఇళ్ళ నిర్మాణాల కోసం టెండర్ల ప్రక్రియ పూర్తి చేసింది. స్థానిక యాదవ నగర్-మార్కండయకాలనీ ప్రాంతంలో ఇళ్ళ నిర్మాణ పనులు చేపట్టారు. కానీ అందులో కొన్ని స్లాబ్‌ల వరకు, మరి కొన్ని పిల్లర్ల వరకు మాత్రమే నిర్మించారు. తొమ్మిదేళ్ళుగా నిర్మాణాలు ఆగిపోయినా బీఆర్ఎస్ ప్రభుత్వం వాటిని పూర్తి చేయించడంలో శ్రద్ధ చూపలేదు. బిల్లులు రాకపోవడంతో నిర్మాణ పనులను కాంట్రాక్టర్ వదిలేశారు.

● లబ్ధిదారుల ఎదురుచూపులు : లాటరీ ద్వారా ఎంపికైన లబ్ధిదారులు డబుల్ బెడ్‌రూం ఇల్లు వస్తుందని సంతోష పడ్డారు. సెంటు భూమి లేని తాము రెండు పడకల గదులతో కూడిన బంగ్లాలో ఉంటామని కలలుకన్నారు. కానీ వారి ఆశలు అడియాసలయ్యాయి. 2016లో చేపట్టిన నిర్మాణాలు ఆగిపోవడంతో నిరాశలో ఉన్నారు. నాయకులను, అధికారులను అడిగి విసిగిపోయారు. పూర్తి చేసి లబ్ధిదారులకు ఇస్తామంటూ ప్రజాప్రతినిధులు ఇచ్చిన హామీలు నీట మూటలయ్యాయి.

ఏడాదిన్నర గడిచినా ఊసే లేదు

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర గడిచినా డబుల్ బెడ్‌రూం ఇళ్ల అంశం కొలిక్కిరాలేదు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ప్రస్తుత ఎమ్మెల్యే విజయరమణారావు ఆధ్వర్యంలో డబల్ బెడ్‌రూంల లబ్ధిదారులతో కలసి తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. వారికి న్యాయం చేయాలని ఇండ్లు పూర్తి చేయించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యేగా గెలిచి, ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర గడిచినా డబుల్ బెడ్‌రూంల గురించి పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నా రు. దాదాపు ఐదు కోట్ల రూపాయల ప్రజల ధనంతో నిర్మించిన డబుల్ బెడ్‌రూంల భవన సముదాయాలు అసంపూర్తిగా మిగిలిపోయాయి. ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకంలో భాగంగా సొంత స్థలం ఉన్న వారిని ఎంపిక చేశారు. కాని తమ సంగతి ఏమిటని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు.



తల్లిదండ్రులు ఇద్దరూ చనిపోయారు

అడప శ్రీనివాస్ సుల్తానాబాద్



బీఆర్ఎస్ ప్రభుత్వంలో తమకు లాటరీ ద్వారా డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కేటాయించారు. దాని కోసం తొమ్మిదేళ్ళుగా ఎదురుచూశాం. తల్లిదండ్రులు ఇద్దరూ చనిపోయారు. కిరాయి చెల్లించలేకపోతున్నాం. ప్రభుత్వం మాకు ఇల్లు కేటాయించి ఆదుకోవాలి.

అద్దె చెల్లించలేని దుస్థితి

ముప్పిడి మచ్చమ్మ సుల్తానాబాద్



డబుల్ బెడ్‌రూమ్ వచ్చిందని అధికారులు చెబితే తొమ్మిదేళ్ల నుంచి ఎదురుచూస్తున్నాం. పనులు లేక కుటుంబాన్ని పోషించుకొనే పరిస్థితి లేకుండా పోయింది. అద్దెలు చెల్లించలేకపోతున్నాం. తమకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళు ఇప్పించాలి

దుర్భరస్థితిలో ఉన్న: వసీం సుల్తానా



తమకు 2016లో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు మంజూరు చేసింది. కానీ ఎనిమిదేళ్ల నుంచి ఎదురు చూస్తూనే ఉన్నాం. ఈ లోగా భర్తను కోల్పోయాను. ఏడాదిన్నర క్రితం అందివచ్చిన కుమారుడిని సైతం కోల్పోయా. కిరాయి ఇళ్లలో ఉండలేకపోతున్నా. అసంపూర్తిగా ఉన్న నిర్మాణాలు పూర్తి చేసి తమకు ఇప్పించాలి.

గోదావరిలో దూకి వ్యక్తి ఆత్మహత్య


నీటిలో హషాం అహ్మద్ మృతదేహం

ధర్మపురి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలోని రాయపట్నం గోదావరినదిలో దూకి హషాం అహ్మద్(45) అనేవ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ ఉదయ్‌కుమార్ తెలిపారు. మంచిర్యాలజిల్లా మంద మర్రి పట్టణానికి చెందిన హషాం అహ్మద్ కొంతకాలంగా ఆర్థిక ఇబ్బం దులతోబాధపడుతుండేవాడని ఆయన పేర్కొన్నారు. ఉదయం రాయపట్నం గోదావరి నదిలో మృతదేహం కనిపిం చడంతో సమాచారం అందించామ న్నారు. మందమర్రిపట్టణానికి చెందిన మహ్మద్అలీ అహ్మద్ అనే వ్యక్తివచ్చి మృతుడు తనకొడుకు హషాంఅహ్మద్ అని గుర్తించాడన్నారు. హషాం అహ్మ ద్ ఫైనాన్స్ విషయమై రాయపట్నం గోదావరి నదిలోదూకి ఆత్మహత్య చేసుకున్నాడని అతడి తండ్రి ఫిర్యాదు చేయగా కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పురుగుల మందు తాగి బలవన్మరణం

జూలపల్లి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): అల్లారుముద్దుగా పెంచుకున్న కూతురు కులాంతర వివాహం చేసుకోవడంతో అప్పటినుంచి మనస్తాపంతో ఉన్న తండ్రి ఆత్మహత్య చేసుకున్న సంఘటన పెద్దపల్లి జిల్లా జూలపల్లి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. మండల కేంద్రానికి చెందిన ఎండి అజ్గర్‌పాష(43)కు ఇద్దరు కూతుళ్ళు పెద్ద కూతురుకు వివాహమైంది. రెండోకూతురు గతనెలలో అదే గ్రామానికి చెందిన యువకుడితో కులాంతర వివాహం చేసుకుంది. అప్పటినుంచి కూతురు తనను మోసం చేసిందని అజ్గర్‌పాష బాధ పడుతుండేవాడు. ఈక్రమంలో మన స్తాపంతో ఆదివారం పొలం వద్ద పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకిచేరాడు. గమనించిన చుట్టు పక్కల వారు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వెంటనే కుటుంబసభ్యులు వైద్యంకోసం కరీం నగర్‌కు, అనంతరం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు.మృతుడిభార్య ఫిర్యాదు మేరకు కేసుదర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సనత్‌కుమార్ పేర్కొన్నారు.

గోపాలమిత్రల గోడు పట్టేదెవరికి?

● 25 ఏళ్లుగా వెట్టిచాకిరి ● క్రమబద్ధీకరణకుకు నోచుకోని వైనం


గేదెకు కృత్రిమ గర్భధారణ చేస్తున్న గోపాలమిత్ర

కథలాపూర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): పశువుల ఆరోగ్యం, అధిక పాలనిచ్చే ఆవులు, గేదెల సంతతిని పెంచడంలో ప్రధాన పాత్ర పోషిస్తున్న గోపాలమిత్రల గోడు వినేవారే కరవయ్యారు. 25 ఏళ్ల నుంచి వెట్టి చాకిరి చేస్తున్న గోపాలమిత్రలు నామమాత్రపు గౌరవ వేతనంతో పల్లెల్లో పనిచేస్తున్నారు. పశు సంవర్థక శాఖ గత 2000-2001 సంవత్సరంలో ఉమ్మడి రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాల్లో పశు సంపద పెంచడానికి శిక్షణ ఇచ్చి గోపాలమిత్రలను నియమించారు. నేటికీ నామమాత్రపు గౌరవ వేతనంతోనే పని చేస్తుండగా రిటైర్‌మెంట్ వయసు వచ్చినా రెగ్యులరైజేషన్‌కు నోచుకోవడం లేదు.



కథలాపూర్ పశువైద్య కేంద్రం

ప్రభుత్వాలు మారినా నెరవేరని హామీలు

అధిక పాల దిగుబడులను ఇచ్చే ముర్రా జాతి గేదెలు, జెర్సీ, పుంగనూరు, సాయివాల్, ఒంగోలు గిత్తల సంతతిని పెంచడానికి కృత్రిమ గర్భధారణ చేయడంలో కీలక భూమిక పోషించడానికి గోపాల మిత్రలను నియమించారు. ప్రస్తుతం ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 150 మంది గోపాలమిత్రలు పనిచేస్తున్నారు. పల్లెల్లో తిరుగుతూ రైతులను చైతన్యవంతం చేసి పశువులకు కృత్రిమ గర్భధారణ చేసి సంతతిని పెంచడంతో పాటు వైద్య సిబ్బందికి వివిధ రకాల పనుల్లో సహకరిస్తున్నారు. వ్యాక్సినేషన్, డీవార్మింగ్ వంటి కార్యక్రమాల్లో కూడా గోపాలమిత్రల సేవలను వినియోగించుకుంటున్నారు. ప్రతీ నెలా 120 కృత్రిమ గర్భధారణ కేసులు విధిగా చేయాల్సి ఉంటుంది. ఒక్కో స్ట్రాకు రూ.40లు చెల్లించి లిక్విడ్ నైట్రోజన్‌తో నింపిన కంటైనర్‌లో మైనస్ 0.90 డిగ్రీల ఉష్ణోగ్రతలో భద్రపరచాల్సి ఉంటుంది. పశువులు ఎదకొచ్చిన సమయాన్ని గుర్తించి మేలు రకం జాతి వీర్యాన్ని రైతు ముంగిటే కృత్రిమ గర్భధారణ చేస్తుంటారు. రైతులు ఇచ్చే పారితోషికంపైనే జీవనం కొనసాగించాల్సిన దుస్థితి ఉంది. గతంలో పాలకులు రెగ్యులరైజ్ చేసి ఆఫీస్ సబార్డినేట్లుగా నియమిస్తామని ఇచ్చిన హామీలు నీటి మూటలుగానే మిగిలి పోయాయని ఆవేదన వెలిబుచ్చుతున్నారు. 25 ఏళ్ల అనుభవంతో పని చేస్తున్న గోపాలమిత్రలను పశు వైద్యశాలల్లో ఖాళీగా ఉన్న పోస్టుల్లో విద్యార్హతల ఆధారంగా నియమిస్తారని ఆశతో ఎదురుచూశారు. ఇటీవల శాఖతో సంబంధం లేని వారిని ఆఫీస్ సబార్డినేట్లుగా నియమించారని గోపాలమిత్రలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఆశలు ఆవిరి చేశారు.. చెన్నవేని దశరథం, ఉమ్మడి జిల్లా గోపాలమిత్ర సంఘం గౌరవాధ్యక్షుడు



గోపాలమిత్రగా 25 ఏళ్లుగా పనిచేస్తున్నాం. పాలకులు తమను రెగ్యులరైజ్ చేస్తారని నమ్మి పల్లెల్లో తిరిగి పశు సంపద పెంపు కోసం శ్రమించాం. గ్రామాల్లో శిబిరాలు, డీవార్మింగ్, వ్యాక్సినేషన్, కృత్రిమ గర్భదారణ వంటి కీలక పనులు నిర్వహిస్తున్నాం. తెలంగాణ ఏర్పడ్డాక తమ జీవితాలు మారిపోతాయని ఆశించినా భంగపాటు తప్పలేదు. ఇప్పటికైనా ఖాళీగా ఉన్న పశువైద్య కేంద్రాల్లో విద్యార్హతల ఆధారంగా ఆఫీస్ సబార్డినేట్లుగా నియమించి గోపాలమిత్ర కుటుంబాలను ఆదుకోవాలి.

తామర పురుగు నివారణతోనే మామిడి దిగుబడులు

● తెలంగాణ ఉద్యానవన విశ్వవిద్యాలయ శాస్త్రవేత్త డాక్టర్ లక్ష్మణ్

జగిత్యాల అగ్రికల్చర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం సీజన్‌లో మామిడిలో తామర పురుగు ఉధృతిని నివారిస్తేనే అధిక దిగుబడులు సాధ్యం అవుతాయని కొండాలక్ష్మణ్ బాపూజీ తెలంగాణ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ డాక్టర్‌లక్ష్మణ్ అన్నారు. జగిత్యాల జిల్లాలోని వివిధగ్రామాల్లో గల మామిడి తోటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం మామిడికాయ వృద్ధిచెంది, టెంకె గట్టిపడే దశలో ఉందన్నారు. పలుతోటలలో తామర పురుగు ఉధృతిని గమనించామని, సాధారణంగా మామిడి తోటలో తేనె మంచుపురుగు పూత, పిందదశలో నష్టాన్ని కలుగజేస్తుందని, అయితే తేనె మంచు పురుగు అదుపులో ఉన్నప్పటికీ తామర పురుగు ప్రభావం వల్ల పిందెలు రాలడం, మంగు ఏర్పడి కాయను పనిరాకుండా చేస్తుందన్నారు. నివారణ చర్యగా పురుగు ఉధృతిని బట్టి,ముందుగా వేప నూనె 3మి.లీ ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని, తర్వాత ఫిప్రోనిల్ 80శాతం డబ్ల్యూజి0.2గ్రా,లేదా స్పైనోసాడ్ 45శాతం ఎస్‌సి 0.3మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. సింథటిక్ పైరిత్రాయిడ్ కీటక నాశనినులను ఈ సమయంలో వాడరాదని సూచించారు. ఆయనవెంట కృషివిజ్ఞాన కేంద్రం రామగిరిఖిల్లా శాస్త్రవేత్త డా.వెంకన్న, ఫామ్‌మేనేజర్ బండారి నరేష్, ఫల పరిశోధన స్థానం సంగారెడ్డి శాస్త్రవేత్త సతీష్, ఉద్యాన అధికారి మహేష్‌తో పాటు మామిడి రైతులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఎక్సైజ్ దాడులు

గంభీరావుపేట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేట మండలం ముచ్చర్ల, లింగన్నపేట తండాల్లో సోమవారం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. నాటుసారా తయారుచేస్తున్నారన్న పక్కా సమాచారం మేరకు ఎక్సైజ్ అధికారులు సోదాలు చేపట్టారు. ఈ సోదాల్లో 300 లీటర్ల బెల్లం పానకం, 12 లీటర్ల నాటుసారా లభ్యం అయ్యింది. బెల్లం పానకం, నాటుసారాను స్వాధీనం చేసుకుని బాధ్యులైన ఇద్దరిపై కేసు నమోదు చేశామని సీఐ శ్రీనివాస్ తెలిపారు. అదేవిధంగా గుడంబా తయారుచేసే ఇద్దరు అనుమానితులను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు సీఐ తెలిపారు. ఈ దాడుల్లో డీటీఎఫ్ ఎస్ఐ శైలజ, సిబ్బంది కిషోర్, మల్లేశ్వర్మ, రాకేష్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.


బెల్లం పానకాన్ని పారబోస్తున్న ఎక్సైజ్ అధికారులు

మహిళను వేధించి హత్య చేసిన నిందితుడికి జీవిత ఖైదు

జగిత్యాల క్రైం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మహిళను లైంగికంగా వేధించి ఒంటిపై కిరోసిన్ పోసి నిప్పంటించి హత్యకు పాల్పడిన వ్యక్తికి జీవిత ఖైదుతో పాటు రూ.1.02 లక్షల జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ సోమవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం కొడిమ్యాల పోలీస్ స్టేషన్ పరిధికి చెందిన ఓ వివాహితను అదే గ్రామానికి చెందిన ఇల్లంతకుంట శ్రీధర్ (28) అనే యువకుడు తరచూ లైంగికంగా వేధిస్తూ ఉండేవాడు. 2019 ఏప్రిల్14న వివాహిత ఒంటరిగా ఇంటి వద్ద ఉన్న సమయంలో శ్రీధర్ ఇంట్లోకి ప్రవేశించి లైంగిక కోరిక తీర్చమని వేధించడంతో పాటు చంపుతానని బెదిరించాడు. మహిళ తిరగబడడంతో ఒంటిపై కిరోసిన్ పోసి నిప్పంటించాడు. తీవ్రంగా గాయపడిన మహిళ రెండు రోజుల అనంతరం చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అప్పటి సీఐలు నాగేందర్, కిషోర్‌లు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సీఎంఎస్ ఎస్సై శ్రీకాంత్, కోర్టు డ్యూటీ అధికారులు సాగర్, కిరణ్, రాజులు సరైన సాక్ష్యులను కోర్టులో ప్రవేశ పెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ మల్లిఖార్జున్ కేసు వాదించారు. నేరం రుజువు కావడంతో ముద్దాయి శ్రీధర్‌కు జీవిత ఖైదు జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు.

చికిత్స పొందుతూ డిగ్రీ విద్యార్థి మృతి


అవేజ్(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): గతనెల 30న రోడ్డు ప్రమాదంలోగాయపడిన ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌లోని డిగ్రీ విద్యార్థి షేక్ అవేజ్(20) హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం వేకువజామున మృతిచెందాడని పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపారు. పోలీసులు,కుటుంబ సభ్యుల కథనం మేరకు.. గ్రామంలోని జైబుల్-సమ్మద్ దంపతుల ఒక్కాగానొక్క కొడుకు అవేజ్ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాలలో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్నాడు. రంజాన్ పండుగ నేపథ్యంలో గతనెల 28న స్వగ్రామానికి వచ్చాడు. అదేనెల 30న సమీప బంధువైన యువకుడు అఫ్రోజ్‌తో కలిసి స్కూటీపై నూతన దుస్తులు కొనుగోలు చేసేందుకు సిరిసిల్ల బయలుదేరారు. మండలంలోని హరిదాస్‌నగర్ గ్రామ శివారులోని కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపై ఎదురుగా వస్తున్న ఆటో అతి వేగంగా స్కూటీని ఢీకొట్టింది. దాంతో విద్యార్థులు అవేజ్, అఫ్రోజ్‌లు తీవ్ర గాయాలపాలయ్యారు. పరిస్థితి విషమంగా మారడంతో హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రులకు తరలించారు. వారం రోజులుగా చికిత్స పొందుతున్న అవేజ్ పరిస్థితి చివరికీ మృతిచెందాడు. మృతదేహం ఇల్లు చేరడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, బంధువుల రోధనలు మిన్నంటాయి. కేసు దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి


రమేష్ (ఫైల్)

వెల్గటూర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): వెల్గటూర్ మండలం స్తంభంపల్లి గ్రామానికి చెందిన జక్కులరమేష్(41) సోమవారం చికిత్సపొందుతూ మృతిచెందాడు. ఎస్సై ఉమసాగర్ తెలిపిన వివరాల ప్రకారం రమేష్ కొన్ని సంవత్సరాలుగా మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది ఈనెల 4న క్రిమి సంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబీకులు జగిత్యాల ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించి సోమవారం మృతి చెందాడు. మృతుని భార్య జక్కుల వనిత ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వీడని 'విదేశీ బంగారం' చిక్కుముడి

● గల్ఫ్ పారిపోయిన నిందితుడు?

వేములవాడ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : సౌదీ అరేబియా నుంచి తీసుకు వస్తుండగా గమ్యస్థానం చేరకముందే మార్గమధ్యలోనే సినీ ఫక్కీలో మాయమైన విదేశీ బంగారం కేసు చిక్కుముడి వీడడం లేదు. జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండల కేంద్రానికి చెందిన రుద్ర రాంప్రసాద్ తన సమీప బంధువు సహకారంతో వేములవాడకు చెందిన కాల్వ వెంకటేష్ అనే వ్యక్తి ద్వారా బంగారం తెప్పించుకోవడం కోసం డబ్బులు పంపించారు. ఈ మేరకు చందుర్తి మండలం జోగాపూర్ గ్రామానికి చెందిన బీరయ్య, అనిల్ పెద్దమొత్తంలో బంగారంతో హైదరాబాదులోని ఎయిర్‌పోర్టులోని దిగిన అనంతరం సమీప బంధువైన ఎనగంటి గ్రామానికి చెందిన ఏనుగుల నాగరాజును కలవగా, సదరు బంగారాన్ని నాగరాజు తీసుకుని కనిపించకుండా పోవడంతో రాంప్రసాద్ వేములవాడ పోలీసులను ఆశ్రయించారు. ఈమేరకు కేసు నమోదు చేసి విచారణ జరిపిన పోలీసులు బంగారం స్వాహా చేశారన్న నేరంపై తొంటి బీరయ్య, గడ్డం అనిల్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో ఏ1 నిందితుడుగా ఉన్న కాల్వ వెంకటేష్ సౌదీలో ఇప్పటికే ఉండగా, ఎ4గా ఉన్న నిందితుడు ఏనుగుల నాగరాజు చాకచక్యంగా పోలీసుల కన్నుకప్పి గల్ఫ్ పారిపోయినట్లు తెలిసింది. మాయమైన బంగారం ఆచూకీ కనుగొనేందుకు ఇద్దరు ఎస్ఐలతో పాటు నలుగురు కానిస్టేబుళ్లతో రెండు బృందాలను పోలీసు అధికారులు ఏర్పాటు చేశారు. శంషాబాద్ విమానాశ్రయం వద్ద స్వాధీనం చేసుకున్న బంగారాన్ని నాగరాజు ఏం చేశాడనే విషయంపై ఇంకా స్పష్టత రాకపోవడం పోలీసు అధికారులను కలవరపరుస్తోంది. నిందితుడు నాగరాజు వాడిన సెల్‌ఫోన్‌కు సంబంధించిన డేటాను సేకరించిన పోలీసులు అందులో లభించిన సమాచారం ఆధారంగా బంగారం రవాణా వ్యవహారంలో ఎవరెవరికి సంబంధాలు ఉన్నాయనే కోణంలో దర్యాప్తు ముమ్మరం చేశారు. కేసు విచారణ తొలి దశలోనే తమ కళ్లుగప్పి చాకచక్యంగా పారిపోయిన నాగరాజును తిరిగి రప్పించేందుకు పోలీసులు లుకౌట్ నోటీస్ జారీచేయనున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా తాను సౌదీ నుంచి 400 గ్రాముల బంగారం తెప్పించుకునేందుకు 35 లక్షల రూపాయలను చెల్లించినట్లు ఫిర్యాదుదారు రవీందర్ చెబుతుండడంపై కూడా అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. 400గ్రాములు బంగారం కోసం 35 లక్షల రూపాయలు చెల్లించి విదేశాల నుంచి తెప్పించుకోవాల్సిన అవసరం ఏముంది అనే ప్రశ్నలు కూడా ఉత్తమవుతున్నాయి. పెద్ద మొత్తంలో బంగారం అక్రమ రవాణా జరిగి ఉంటుందని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సౌదీ నుంచి బంగారం తీసుకువచ్చిన బీరయ్య, అనిల్ సైతం తాము చాలా పెద్దమొత్తంలో బంగారం తీసుకువచ్చినట్లు సన్నిహితుల వద్ద చెప్పినట్లు ప్రచారం సాగుతోంది. దీంతో అసలు ఈ బంగారం రవాణా వ్యవహారం ఏ స్థాయిలో సాగి ఉంటుందనేది తేలాల్సి ఉంది.

ఆర్థిక ఇబ్బందులతో ఒకరి బలవన్మరణం

కొడిమ్యాల, ఏప్రిల్7 (ఆంధ్రజ్యోతి) : కొడిమ్యాల మండల కేంద్రానికి చెందిన రాచర్ల ప్రకాష్(54) ఆర్థిక ఇబ్బందులతో ఆదివారం రాత్రి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు కొడిమ్యాల ఎస్సై ఎస్.సందీప్ తెలిపారు. ప్రకాష్ వద్ద పలువురు అప్పుగా తీసుకొని తిరిగి ఇవ్వక పోవటంతో ఇబ్బందుల పాలయ్యాడు. ఇంటి యజమాని తరుచుగా ఇంటిని ఖాళీ చేయాలని గొడవ పెట్టాడన్నారు. ఇంటి యజమానితో ఆదివారం రాత్రి గొడవ జరగటంతో అద్దెకు ఉంటున్న ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి భార్య రాధ ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

రాజన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు

● కోడెమొక్కులు చెల్లించుకున్న భక్తులు


రాజన్నను దర్శించుకుంటున్న భక్తులు

వేములవాడ కల్చరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి ఆలయానికి సోమవారం భక్తులు పోటెత్తారు. వివిధ ప్రాంతాల నుంచి వేములవాడకు తరలివచ్చిన భక్తులు సోమవారం తెల్లవారు జామునే ఆలయ కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకుని ధర్మగుండంలో పవిత్ర స్నానాలను ఆచరించారు. ధర్మదర్శనం, శీఘ్రదర్శనం, బ్రేక్‌దర్శనం క్యూలైన్‌ల ద్వారా భక్తులు ఆలయంలోకి చేరుకుని శ్రీపార్వతిరాజరాజేశ్వర స్వామి వారలను దర్శించుకున్నారు. రాజన్నకు అత్యంత ప్రీతిపాత్రమైన కోడెమొక్కును చెల్లించుకునేందుకు భక్తులు గంటల తరబడి క్యూలైన్‌లో నిరీక్షించారు. ఆలయంలోకి ప్రవేశించిన భక్తులు రాజన్నకు కోడెమొక్కు చెల్లించుకున్నారు. అనంతరం అనుబంధ ఆలయాల్లో కుంకుమ పూజలో పాల్గొన్నారు. బద్దిపోచమ్మ అమ్మవారికి బోనం తీసి డప్పుచప్పుళ్ల, శివసత్తుల నృత్యాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి పిల్లపాపలు చల్లంగా ఉండాలని వేడుకున్నారు.

ఈవో వినోద్‌రెడ్డికి ఆలయ ఉద్యోగుల సన్మానం..

వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో శ్రీరామనవమి నవరాత్రోత్సవాలు ఘనంగా నిర్వహించిన సందర్భంగా ఆలయ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఈవో వినోద్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు శ్రావణ్‌కుమార్, అశోక్‌కుమార్, జయకుమారి, సూపరింటెండెంట్‌లు వరి నర్సయ్య, శ్రీకాంత్, సీనియర్ అసిస్టెంట్‌లు మమత, పురాణం వంశీ, బొడుసు మహేష్, లతదేవి, ప్రధాన అర్చకులు మామిడిపల్లి రాములు, చంద్రగిరి శరత్, గోపన్నగారి రఘు, గౌతమ్, కూరగాయాల శ్రీనివాస్, సుశీల్ తదితరులు ఉన్నారు.


ఈవో వినోద్‌రెడ్డిని సన్మానిస్తున్న భక్తులు


బద్దిపోచమ్మ వద్దకు బోనాలతో వెళుతున్న భక్తులు

గుండెపోటుతో దుబాయిలో అయిలాపూర్ వాసి మృతి


శ్రీనివాస్ గౌడ్ (ఫైల్)

కోరుట్లరూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): దుబాయిలో గుండెపోటుతో సోమవారం కోరుట్లరూరల్ మండలం అయిలాపూర్ గ్రామానికిచెందిన గాజర్ల శ్రీనివాస్‌గౌడ్(55) మృతిచెం దాడు. ఐదుసంవత్సరాల క్రితం శ్రీనివాస్‌గౌడ్ ఉపాధి నిమిత్తం అప్పుచేసి గల్ఫ్‌దేశానికి వెళ్లాడు. సోమవారం ఉదయం గుండెపోటుతో శ్రీనివాస్‌గౌడ్ తను ఉంటున్న రూంలో మృతిచెందినట్లు అతడి స్నేహితులు బంధువులకు ఫోన్‌ద్వారా సమాచారం అందించారు. శ్రీనివాస్‌గౌడ్‌కు భార్య జల, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. శ్రీనివాస్‌గౌడ్ మృతదేహం త్వరగా ఇంటికి చేరేలా కేంద్రప్రభుత్వం చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

స్థల పరిశీలనలోనే కేజీబీవీ

● గన్నేరువరంలో స్కూల్ ఏర్పాటయ్యేనా?

● ఈ సంవత్సరమైనా ప్రారంభించాలని కోరుతున్న ప్రజలు

గన్నేరువరం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మండలానికి కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల మంజూరై ఏడాదిదాటినా పాఠశాల ఏర్పాటుపై స్పష్టత కొరవడింది. ఏడాది క్రితం మండల కేంద్రంలో కేజీబీవీ ఏర్పాటు కోసం ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, అధికారులు, నాయకులతో కలిసి ప్రభుత్వ స్థలాలను, ప్రైవేట్ బిల్డింగ్‌లను పరిశీలించారు. అనుకూలంగా ఎక్కడా భవనం దొరకకపోవడంతో తిమ్మాపూర్‌లోనే కేజీబీవీని ప్రస్తుతానికి కొనసాగిస్తున్నారు. మండల కేంద్రంలో ఏర్పాటుచేసే కేజీబీవీ పాఠశాలలో ఉద్యోగాల కోసం ఇటీవల అవుట్ సోర్సింగ్ ద్వారా అటెండర్, వాచ్‌ఉమెన్, హెడ్‌కుక్, అసిస్టెంట్ కుక్, స్వీపర్ వంటి మొత్తం ఏడుఉద్యోగాలకు దరఖాస్తులను తీసుకున్నారు. దీంతో మండల కేంద్రంలో త్వరలోనే కేజీబీవీ ఏర్పాటు అవుతుందని మండల ప్రజలు భావించారు. ఈ విద్యాసంవత్సరం ముగుస్తున్నందున రాబోయే 2025-26విద్యా సంవత్సరానికైనా కేజీబీవీ పాఠశాలను మండలకేంద్రంలో ఏర్పాటుచేయాలని మండల ప్రజలు కోరుతున్నారు. దీనిపై ఎంఈవో కెరామయ్యను ఆంధ్రజ్యోతి సంప్రదించగా కేజీబీవీ పాఠశాలను మండలంలో ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వ, ప్రైవేట్ భవనాలు అనుకూలంగా లేవు. దీంతో తిమ్మాపూర్‌లోనే కొనసాగిస్తున్నట్లు తెలిపారు.


గన్నేరువరంలో కేజీబీవీ కోసం ప్రభుత్వ స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ (ఫైల్)

విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా మండల కేంద్రంలో పాఠశాలకు అనువైన ప్రభుత్వ స్థలాన్ని సేకరించి నివేదిక ఇవ్వవలసిందిగా తహసీల్దారును ఆదేశించినట్లు తెలిపారు. దీంతో తహసీల్దారు ఇప్ప నరేందర్‌ను ఆంధ్రజ్యోతి సంప్రదించగా మండల కేంద్రంలోని మైలారం రోడ్డుకు ఏనె ప్రాంతంలో 5ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని కేజీబీవీ పాఠశాల కోసం సేకరించామని, విద్యాశాఖకు ఈ భూమిని అప్పగించేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.

రుద్రంగిలో విషాదం..

- ఫుడ్ పాయిజన్‌తో తల్లీ, కొడుకు మృతి
- మృతురాలి ఇంటి ఎదుట బంధువుల ఆందోళన



పుష్పలత, నిహాల్ తేజ్ (ఫైల్)

రుద్రంగి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : ఫుడ్‌పాయిజన్‌తో తల్లీకొడుకులు మృతి చెందడంతో మండల కేంద్రంలో విషాదం నెలకొంది. మండలకేంద్రానికి చెందిన కాదాసు పుష్పలత(35), ఆమె కూమారుడు నిహాల్ తేజ్(6) ఈనెల4న రాత్రి చపాతీలు తిన్నారు. అదేరాత్రి ముందుగా నిహాల్‌కు, గంటవ్యవధిలోనే పుష్పలతకు వాంతులు కాగాస్థానికంగా చికిత్స అందించారు. మరుసటి రోజు ఉదయం నిహాల్‌కు ఫిట్స్ రావడంతో చికిత్స కోసం తల్లీకొడుకులను కోరుట్లలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో జగిత్యాల, అక్కడి నుంచి కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా పుష్పలత ఆదివారం రాత్రి మృతిచెందింది. మెరుగైన వైద్య కోసం బాలుడు నిహాల్ తేజ్‌ను వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా సోమవారం తెల్లవారుజామున నిహాల్ తేజ్ మృతిచెందాడు. మృతురాలి భర్త జీవనోపాధి కోసం గల్ఫ్ వెళ్లాడు. తన చెల్లె, మేనల్లుడి మృతిపై అనుమానం ఉందంటూ పుష్పలత అన్న పాలెం శ్రీనివాస్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఆనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రుద్రంగి ఎస్‌ఐ ఎస్ అశోక్ తెలిపారు. కాగా, తల్లీకుమారుడి మృతిపై గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ముందస్తుగా బందోబస్తు ఏర్పాటుచేశారు. కాగా, రుద్రంగి మండల కేంద్రంలో తల్లీకొడుకులు అనుమానాస్పదంగా మృతిచెందారని మృతురాలు అత్తమామ ఇంటి వద్ద పుష్పలత బంధువులు ఆందోళనకు దిగారు. పుష్పలత, నిహాల్‌తేజ్ ఫుడ్‌పాయిజన్ వల్ల చనిపోలేదని ఆందోళన చేపట్టగా, అక్కడికి చెరుకున్న సీఐ వేంకటేశ్వర్లు, ఎస్‌ఐ సిరిసిల్లఅశోక్ మృతురాలి బంధువులతో మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం సింగారం గ్రామ శివారులోని దర్శవాలీ గుట్ట ప్రాంతంలోని పేకాట స్థావరంపై ఎస్‌ఐ రమాకాంత్ ఆధ్వర్యంలోని పోలీసులు సోమవారం దాడులు నిర్వహించారు. ఖచ్చితమైన సమాచారంతో దాడి చేయడంతో గమనించిన ఐదుగురు పేకాటరాయుళ్లు పారిపోయారు. మరో ఇద్దరిని అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించామని ఎస్‌ఐ రమాకాంత్ పేర్కొన్నారు. వారి వద్ద నుంచి రూ.4200 నగదు, ఒక సెల్‌ఫోను, బైక్‌ను స్వాధీనపర్చుకున్నామని తెలిపారు. పారిపోయిన ఐదుగురు వ్యక్తులపై ఆరా తీస్తున్నామని పేర్కొన్నారు. కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రమాకాంత్ వివరించారు.

సంపూర్ణ ఆరోగ్యానికి చిరు ధాన్యాలు



- పాత సంప్రదాయం తిరిగి వస్తోంది
- తృణధాన్యాలపై పెరుగుతున్న ఆసక్తి

చొప్పదండి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రజలు పాత రోజుల్లో వరి(బియ్యం)కి బదులుగా జొన్నలు, రాగులు, కొర్రలు, సజ్జలు, వరిగెలు, గుమ్మడి గింజలను ఆహారంగా తీసుకునేవారు. వర్షాభావ పరిస్థితుల్లో కూడా ఇవి బాగా పండేవి. పండుగల సందర్భంలోనే ఇళ్లలో బియ్యంతో అన్నాన్ని వండుకునే వారు. జొన్నరొట్టె వాడకం బాగా ఉండేది. జనాభా పెరుగుదల పాటు సేద్యం పెరగడంతో వరిధాన్యం ఉత్పత్తి పెరిగింది. పాత రుచులైన రాగులు, సజ్జలు, జొన్నల వినియోగం తగ్గి బియ్యంతో చేసిన అన్నం వినియోగం పెరిగింది. ఫాస్ట్‌గా ఫాస్ట్ ఫుడ్ కల్చర్ వచ్చింది. దీనితో ప్రజల ఆరోగ్యం దెబ్బతిన్నది. చిన్న వయస్సులోనే బీపీ, షుగర్ రావడం ప్రారంభమైంది. దీంతో ప్రజలు పాత రుచుల వైపు మొగ్గు చూపుతున్నారు. రాగి సంకటి, జొన్నరొట్టె, సజ్జ రొట్టె, కొర్రలు, అరిగెలు, అండుకొర్రల వినియోగం బాగా పెరిగిపోయింది.

మారుతున్న జీవన విధానం

ఎప్పుడైతే తృణదాన్యాల వినియోగం తగ్గిందో, అన్నం వాడకం పెరిగిందో అప్పటినుంచి మనిషికి రోగాలు పెరిగిపోయాయి. తృణ ధాన్యాలు వాడిన రోజుల్లో మనిషి కాయకష్టం చేసేవారు. అప్పుడే సంపూర్ణ ఆరోగ్యంగా ఉండేవాడు. మనిషి కూర్చున్న చోటునుంచి లేవకుండా పని చేసే వెసులుబాటు రాగా శారీరక శ్రమ తగ్గి రోగాలు పుట్టుకొస్తున్నాయి.

పాశ్చాత్య దేశాల అలవాట్లను ఆకళింపు చేసుకొని ఫాస్ట్‌ఫుడ్ మోజులో పడి మన ప్రాచీన పద్ధతులను అటుకెక్కించిన సందర్భం నుంచి తిరిగి వేగంగా జీవన విధానం మారుతోంది. ప్రస్తుతం కొర్రలు, జొన్న గడక, రాగి సంకటి, పచ్చ, తెల్లజొన్న రొట్టెలు, సజ్జ రొట్టెల వినియోగం బాగా పెరిగింది. ఫాస్ట్‌ఫుడ్ కల్చర్ నుంచి చాలామంది బయటకు వస్తూ జీవన విధానాన్ని మార్చుకుంటు న్నారు. రాగులు, జొన్నలు తిన్న రోజుల్లో మధుమేహం, బీపీలు ఉండేవి కావు. చిరుధాన్యాల సాగును ప్రోత్సహించాలనే లక్ష్యంతో కేంద్రప్రభుత్వం 2023-24సంవత్సరాన్ని ఇయర్ ఆఫ్ మిల్లెట్స్‌గా ప్రకటించింది. మిల్లెట్ సాగుకు పలు ప్రోత్సాహకాలను ప్రకటించి సాగును పెంచేందుకు కృషిచేస్తోంది. ప్రస్తుతం టిఫిన్ సెంటర్లలోనూ రాగి దోశలు, జావా, మిల్లెట్స్ ఇడ్లీలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.




● రాగులు..



రాగులను ఆహారంగా తీసుకోవడం వల్ల శరీరంలో ఉన్న అదనపు కొవ్వు కరుగుతుంది. పిల్లల ఎదుగుదలకు, వయస్సు మళ్లిన వారికి, మహిళలకు ఎముకల పుష్టికి ఉపయోగ పడుతుంది. మధుమేహ రోగులలో చక్కెర స్థాయిని నియంత్రిస్తుంది.

● జొన్నలు..



పేదవాడి ఆహారంగా జొన్నలు పేరొందాయి. జొన్నపిండితో చేసిన ఆహారపదార్థాలను తింటే తేలికగా జీర్ణమవుతాయి. జబ్బుబారిన పడినవారు జొన్నలు ఆహారం తీసుకుంటే త్వరగా కోలుకుంటారు.

● కొర్రలు..



ప్రపంచవ్యాప్తంగా ఎక్కువగా మంది ఇష్టపడే ఆహారపంటలలో కొర్రలకు ప్రత్యేక స్థానం ఉంది. వీటిలో పోషకాలు, ప్రోటీన్లు ఉంటాయి. గుండెకు రక్తప్రసరణను సక్ర మంగా జరిగేలా చేస్తాయి. శరీరంలో వ్యర్థాల ను బయటకు పంపిస్తాయి. కొర్రల ఆహారం ఎంత తిన్నా బరువు పెరుగుదల ఉండదు.

కాంగ్రెస్ ముసుగులో బీఆర్ఎస్ నేతలు



రేచపల్లిలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జీవన్‌రెడ్డి

సారంగాపూర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): పది సంవత్సరాల బీఆర్ఎస్ ప్రభుత్వపాలనలో కాంగ్రెస్‌కార్యకర్తలపై అరాచకాలకు పాల్పడిన బీఆర్ఎస్ నేతలు రాజ్యాధికారం కోసం మరోమారు కాంగ్రెస్ ముసుగులో అరాచకాలకు పాల్పడుతున్నారని మాజీమంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డి విమర్శించారు. సోమవారం జగిత్యాలజిల్లా సారంగాపూర్ మండలం రేచపల్లి గ్రామంలో నిర్వహించిన జై బాపు, జైభీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా జీవన్‌రెడ్డి మాట్లాడుతూ జగిత్యాల ఎమ్మెల్యే మాకునూరి డాక్టరు సంజయ్ కుమార్‌ను ఉద్దేశించి పరోక్షంగా విమర్శనాస్త్రాలు సంధించారు. రాజ్యాధికారం కోసం కాంగ్రెస్ ముసుగులో వస్తున్న బీఆర్ఎస్ నేతలు బిహార్ కూలీల మాదిరిగా కమీషన్ తీసుకొని వచ్చి వెళ్తుంటారని విమర్శించారు. కాంగ్రెస్‌పార్టీ కోసం, ప్రజల సంక్షేమం కోసంనిరంతరం పోరాడుతానని జీవన్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు ఎవరూ తనకు పదవిలేదని అధైర్యపడొద్దని ఆయన సూచించారు. తన తుదిశ్వాస వరకు ప్రజలసంక్షేమం కోసం ప్రజాక్షేత్రంలోనే ఉంటానని జీవన్‌రెడ్డి వ్యాఖ్యానించారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

గణేశ్‌నగర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడిజిల్లాలోని డిగ్రీ ఉత్తీర్ణులైన వెనుకబడిన తరగతుల అభ్యర్థులకు హైదరాబాద్ స్కూల్‌ఆఫ్ బ్యాంకింగ్‌అండ్‌ఫైనాన్స్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ హైదరాబాద్ ద్వారా బ్యాంకింగ్, ఫైనాన్స్‌లో ఉచితశిక్షణ అందించనున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు మంగళవారంలోగా www.tgbcstudycircle.cgg.gov.in లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈనెల12న ఉమ్మడిజిల్లా కేంద్రంలో ఆన్‌లైన్ స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వచ్చినమార్కుల ఆధారంగా 30మందిని ఎంపిక చేయనున్నట్లు, శిక్షణ అనంతరం ప్రైవేట్ బ్యాంకుల్లో ఉపాధి కల్పించనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 0878-2268686నంబరులో సంప్రదించాలని సూచించారు.

సిరిసిల్ల నేతన్నల సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలి

- కేంద్రహోంశాఖ సహాయ మంత్రి స్పందించాలి
- సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు స్కైలాబ్‌బాబు



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు స్కైలాబ్‌బాబు

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల నేతన్నల సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలని సీపీఎం రాష్ట్రకమిటీ సభ్యుడు స్కైలాబ్ బాబు డిమాండ్ చేశారు. సిరిసిల్లలో ప్రభుత్వం తయారుచేయించే చీరలకు సంబంధించి మరమగ్గాల, అనుబంధ రంగాలైన వార్పిన్, వైపని కార్మికులకు మెరుగైన వేతనాలు వచ్చే విధంగా ప్రభుత్వమే కూలి నిర్ణయించి ఇతర సమస్యలు పరిష్కరించాలన్నారు. కరీంనగర్ ఎంపీ, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ స్పందించాలన్నారు. సిరిసిల్లలో మరమగ్గాలతోపాటు అనుబంధ రంగాల కార్మికుల కూలి నిర్ణయించి, సమస్యలను పరిష్కరించాలంటూ సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధికసమ్మె 7వ రోజుకు చేరుకుంది. అయినా రాష్ట్ర ప్రభుత్వంతో పాటు జిల్లా అధికారులు స్పందించకపోవడంతో సోమవారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో 24గంటల దీక్షలను చేపట్టారు. ముఖ్య అతిథిగా సీపీఎం రాష్ట్రకమిటీ సభ్యులు స్కైలాబ్‌బాబు హాజరై దీక్షలను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని సిరిసిల్లలో నేతన్నలు వారం రోజులుగా నిరవధిక సమ్మె చేసున్నా రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం దుర్మార్గమని మండిపడ్డారు. నేతన్నలు చేస్తున్న సమ్మె పోరాటానికి సీపీఎం రాష్ట్ర కమిటీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోందన్నారు. సిరిసిల్లలో నేతన్నల ఆత్మహత్యల నేపథ్యంలో ఉపాధి కల్పించి మెరుగైన వేతనాలు అందించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళనలు, పోరాటాల ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి బుతుకమ్మ చీరల స్థానంలో మహిళాస్వశక్తి సంఘాల మహిళాలకు సంవత్సరానికి రెండు చీరలను అందించేందుకు ఆర్డర్‌లను ఇచ్చిందన్నారు. యాజమానులకు కూలి నిర్ణయించి కార్మికులకు కూలిని నిర్ణయించకుండా అన్యాయం చేయడం సరైందికాదన్నారు.

ప్రభుత్వం అధికారంలోకి రాకముందు సిరిసిల్లలో నేతన్నలను అన్ని విధాలుగా ఆదుకుంటామని చెప్పి 15 నెలలు అవుతున్నా ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదని, ఇప్పటికైనా ప్రభుత్వంతో పాటు చేనేత జౌళిశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు స్పందించి సిరిసిల్లలో నేతననల సమస్యలతో పాటు వారి డిమాండ్లను పరిష్కరించి సమ్మెను విరమింపజేయాలని కోరారు. స్థానిక కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌కు సిరిసిల్లలో నేతన్న సమస్యలు కనిపించడంలేదా అని ప్రశ్నించారు. బండి సంజయ్ మత విద్వేషాలు రెచ్చగొట్టడమే తప్ప కార్మికుల సమస్యలు పట్టించుకోరా అని అన్నారు. ఇప్పటికైనా బండి సంజయ్‌కుమార్ కేంద్ర ప్రభుత్వంతో పాటు ప్రధాన మంత్రి నరేంద్రమోదీతో మాట్లాడి వస్త్రపరిశ్రమ అభివృద్ధితో పాటు నేతన్నల ఉపాధి సంక్షేమ కోసం పనిచేయాలని కోరారు.

దీక్షకు బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, బీఎస్పీ పట్టణ అధ్యక్షుడు అరుకాల రమేష్‌లతోపాటు వివిధ ప్రజాసంఘాల నాయకులు సంఘీభావం ప్రకటించారు. ఈ దీక్షల్లో మూషం రమేష్ కోడం రమణ, సిరిమల్ల సత్యం, కుమ్మరికుంట కిషన్, నక్క దేవదాస్, ఎలిగేటి శ్రీనివాస్, గుండు రమేష్, బూట్ల వెంకటేశ్వర్లు, అవధూత హరిదాస్, బాస శ్రీధర్, మేకల బాలరాజు, కస్తూరి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఫీజు బకాయిల విడుదలలో ప్రభుత్వ నిర్లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠరెడ్డి

భగత్‌నగర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఫీజు బకాయిల విడుదలలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని ఏఐఎస్ఎఫ్ రాష్ట్రఅధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి అన్నారు. సోమవారం నగరంలోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో సీఎంవద్ద విద్యాశాఖ ఉన్నా ఫీజు బకాయిల విడుదల పట్టించుకోవడం లేదన్నారు. విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటమాడవద్దన్నారు. యూనివర్సిటీల భూములను అమ్మాలని చూస్తే ప్రభుత్వంపై తిరుగుబాటు తప్పదన్నారు. ప్రైవేట్ విద్యా సంస్థలు ముందస్తు అడ్మిషన్లు చేపడితే ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ప్రత్యక్ష దాడులు చేస్తామన్నారు ఉస్మానియా యూనివర్సిటీలో అత్యవసర ఆంక్షల ఉత్తర్వులను వెంటనే వెనక్కి తీసుకోవాలన్నారు. వేసవిలో ప్రైవేటు విద్యాసంస్థలు ఇంటర్ తరగతులు నిర్వహిస్తున్నాయని ఆరోపించారు. సమావేశంలో జిల్లాకార్యదర్శి మచ్చ రమేష్, నగర కార్యదర్శి మామిడిపల్లి హేమంత్, నగర నాయకులు పాల్గొన్నారు.

ఎన్టీపీసీలో జెమ్ 2025 వర్క్‌షాప్‌నకు సన్నాహాలు

- బాలికలకు మెడికల్ చెకప్ ప్రక్రియ షురూ

జ్యోతినగర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీపీసీ సీఎస్ఆర్ ఆధ్వర్యంలో యేటా నిర్వహిస్తున్న బాలికా సాధికారతా మిషన్(జెమ్) వర్క్‌షాప్ ఈ ఏడాది నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. దీనిలో భాగంగా సోమవారం జెమ్2025 వర్క్‌షాప్‌లో పాల్గొనే 120 మంది బాలికల ఎంపికకోసం మెడికల్ చెకప్ నిర్వహించారు. నాలుగు మండలాల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన194 మంది బాలికలకు(8వ తరగతి) ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈనెలలో ప్రారంభమయ్యే జెమ్ 2025 వర్క్‌షాప్ 28 రోజులపాటు కొనసాగుతుంది. బాలికలను చదువుతోపాటు వివిధ రంగాలలో ప్రోత్సహించే ఉద్దేశంతో ఎన్టీపీసీ యాజమాన్యం 120 మంది పేద విద్యార్థినులకు జెమ్ వర్క్‌షాప్ ద్వారా శిక్షణనిస్తుంది. 28 రోజులపాటు నిర్వహించే వర్క్‌షాప్‌లో ఇంగ్లీషు, హిందీ వ్యాకరణం, కంప్యూటర్ లిటరసీ, మ్యాథమెటిక్స్, సైన్స్‌తోపాటు, స్కిల్ డెవలప్‌మెంట్, యోగా, డ్యాన్స్, కరాటే, డ్రాయింగ్‌లో శిక్షణ ఇస్తారు. గర్ల్స్ ఎంపవర్‌మెంట్ మిషన్ కార్యక్రమం 2019 నుంచి రామగుండం ఎన్టీపీసీలో యేటా నిర్వహిస్తోంది.



విద్యార్థినికి వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యురాలు

జిల్లెల్ల యువకుడికి ఉత్తమ అవార్డు

- రైతు సమ్మేళనంలో గవర్నర్ చేతుల మీదుగా జ్ఞాపిక అందజేత



అవార్డును అందుకుంటున్న ప్రవీణ్

తంగళ్లపల్లి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): హైదరాబాదులో నిర్వహించిన ప్రకృతి, సేంద్రియ రైతు సమ్మేళనంలో తంగళ్ళపల్లి మండలం జిల్లెల్ల గ్రామానికి చెందిన యువ ఇన్నోవేటర్ కొడుముంజ ప్రవీణ్ ఉత్తమ ఇన్నోవేటివ్ అవార్డును గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ చేతుల మీదుగా అందుకున్నారు. ఈనెల 4న హైదరాబాద్‌లోని ఏకలవ్య గ్రామీణవికాస్ ఫౌండేషన్, పల్లెసృజన ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు సమ్మేళనంలో ఉత్తమ ఇన్నోవేటర్‌గా ప్రశంసపత్రంతోపాటు జ్ఞాపికను అందుకున్నారు. మల్బతోటలో కొమ్మలు కత్తిరించి, మూటకట్టే పరికరాన్ని కొడుముంజ ప్రవీణ్ రూపొందించి పలువురి మన్ననలు పొందాడు. రైతు సమ్మేళనంలో తాను తయారుచేసిన యంత్రాన్ని ప్రదర్శించగా గవర్నర్ పరిశీలించి అభినందించినట్లు ప్రవీణ్‌తెలిపారు. గవర్నర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని జ్ఞాపికను అందుకోవడంతో స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు అభినందించారు.

రోడ్డు ప్రమాద ఘటనపై కేసు నమోదు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో గత నెల 31న జరిగిన రోడ్డు ప్రమాద ఘటనపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రమాకాంత్ సోమవారం రాత్రి తెలిపారు. మండలంలోని బుగ్గరాజేశ్వరతండాకు చెందిన ధరావత్ రమేశ్, అతని అన్న కొడుకు అజ్మీరా రవీందర్‌లు కలిసి తమ ద్విచక్రవాహనంపై మండల కేంద్రం నుంచి స్వగ్రామానికి వెళుతున్న క్రమంలో స్థానిక సాయిబాబా కమాన్ వద్ద కామారెడ్డి- సిరిసిల్ల వైపుకు వెళుతున్న గుర్తు తెలియని వ్యక్తి ద్విచక్రవాహనంతో అతి వేగంగా ఢీకొట్టినట్లు చెప్పారు. ప్రమాదంలో రమేశ్, రవీందర్‌లు తీవ్ర గాయాలపాలయ్యారని పేర్కొన్నారు. బాధితుడు రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్‌ఐ రమాకాంత్ వివరించారు.

జాతీయస్థాయి హ్యాకథాన్‌లో జ్యోతిష్మతి విద్యార్థులకు ప్రథమ బహుమతి



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల చైర్మన్ జువ్వాడి సాగర్‌రావు

తిమ్మాపూర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): జ్యోతిష్మతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీఅండ్‌సైన్స్ కళాశాల విద్యార్థులు హైదారబాద్‌లో జరిగిన జాతీయ స్థాయి హ్యాకథాన్‌లో ప్రథమ బహుమతి పొందినట్లు విద్యాసంస్థల చైర్మన్ జువ్వాడి సాగర్‌రావు తెలిపారు. ఆదివారం హైదారాబాద్‌లో ఎస్ఆర్ఎం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీఅండ్‌సైన్స్, సీవోహెచ్‌వోఆర్‌టి సంయుక్తంగా నిర్వహించిన హ్యాకథాన్‌లో 92జట్లతో పోటీపడిన విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. పంట వ్యాధులను గుర్తించడానికి, స్థిరమైన వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడానికి ప్రాజెక్ట్ ఆల్ క్రాప్ కేర్ అనే ఏఐ ఆధారిత పరిష్కారాన్ని విద్యార్థులు అజిత్(సీఎస్ఈ-ఏ)-నాలుగవ సంవత్సరం, అక్షిత్(సీఎస్‌యం ఏ)- 4వ సంవత్సరం, రమేష్ (సీఎస్ఈ-డీ) -4వ సంవత్సరం చదువుతున్న విద్యార్థులుకలిసి రూపొందించిన అత్యుత్తమ ప్రదర్శనకుగాను రూ.10వేలనగదు బహుమతి, ప్రశంసాపత్రంతోపాటు ఈవెంట్ వారు అందించిన టీ-షర్టులు గెలుపొందినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను అభినందించారు. విద్యార్థుల భవిష్యత్తుకు ఇది బండారు బాట వేస్తుందన్నారు.

గ్రామ పంచాయతీలకు భవనాలు లేక ఇక్కట్లు

- అసంపూర్తిగా భవన నిర్మాణాలు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు

మంథని రూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామ పంచాయతీలకు పక్కా భవనాలు లేక పోవడంతో ప్రజలు, అధికారులు ఇబ్బందులకు గురువుతున్నారు. భవన నిర్మాణాలను ప్రారంభించినా పనులు పూర్తి కాకపోవడంతో అసంపూర్తిగానే నిలిచిపోయాయి. మండ లంలోని 34 గ్రామ పంచాయతీల్లో 11 గ్రామ పంచాయతీలకు పక్కా భవనాలు లేకపోవడంతో అద్దె ఇండ్లు, ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడి కేంద్రాలు, గోపాల మిత్ర భవనాల్లో కొనసాగిస్తున్నారు. మండలంలోని లక్కేపూర్, సిరిపురం, ఆరెంద, భట్టుపల్లి, బెస్తపల్లి, బిట్టుపల్లి, గద్దలపల్లి, గాజులపల్లి, గుమ్నూనూరు, గుంజపడుగు, కాకర్లపల్లి, సూరయ్యపల్లి, వెంకటాపూర్ గ్రామ పంచాయతీలకు భవనాలు శిథిలావస్థకు చేరడంతో ఉపాధిహామీ పథకంలో కొత్త భవనాలు మంజూరయ్యాయి. కొన్ని భవనాలు 2016-17లో మంజూరు కాగా, మరి కొన్ని 2023లో మంజూరయ్యాయి. అయితే నిధులు రాకపోవడంతో భవన నిర్మాణాల సంబంధిత కాంట్రాక్టర్లు మధ్యలోనే వదిలి పెట్టారు. దీంతో గ్రామ పంచాయతీ కార్యక్రమాలను కొన్ని చోట్ల ప్రైవేట్ ఇండ్లలో నిర్వ హిస్తుండగా అధికారులకు అద్దె భారంపడుతోంది. మరికొన్ని చోట్ల ప్రభుత్వానికి సంబంధించిన ఇతర భవనాల్లో నిర్వహిస్తుండగా సంబంధిత శాఖ వారికి ఇబ్బందిగా ఏర్పడుతుంది. అధికారులు స్పందించి భవన నిర్మాణాలను పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.



అసంపూర్తి నిర్మాణంలో గాజులపల్లి పంచాయతీ భవనం



అద్దె ఇంట్లో కొనసాగుతున్న సూరయ్యపల్లి కార్యాలయం

గ్రామ పంచాయతీ భవనాన్ని త్వరగా పూర్తి చేయాలి

కారెంగుల సుధాకర్, మాజీ సర్పంచ్ గాజులపల్లి.



గ్రామంలో ఉన్న పాత భవనాన్ని తొలగించి కొత్త భవన నిర్మాణాన్ని ప్రారంభించాం. అది పూర్తి కాలేదు. భవనం స్లాబ్ వరకు మాత్రమే నిర్మాణం అయింది. గ్రామ పంచాయతీ నిర్వాహణను ప్రభుత్వ పాఠశాల ఆవరణలోని ఒక గదిలో నిర్వ హిస్తున్నారు. దీంతో విద్యార్థులకు, ప్రజలకు ఇబ్బంది ఏర్పడుతోంది. త్వరగా భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలి.

కూలీలకు ఎన్ని రోజులు ఉపాధి కల్పిస్తున్నారు

పద్మజ, ఎంపీడీవో



ఆంధ్రజ్యోతి: ఉపాధిహామీ పథకంలో ఎన్ని రోజులు పని కల్పిస్తున్నారు?

ఎంపీడీవో: జాబు కార్డు కలిగిన ప్రతీ ఒక్కరికి ఉపాధి హామీ పథకంలో భాగంగా 100 రోజుల పని దినాలు కల్పించేందుకు కృషి చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: ఉపాధి కూలీలు పనిచేస్తున్న ప్రదేశాల్లో ఎలాంటి సౌకర్యాలను కల్పిస్తున్నారు?

ఎంపీడీవో: ఉపాధి పని ప్రదేశాలలో కూలీలకు తాగునీరు, నీడ కోసం గ్రీన్‌నెట్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మెడికల్ కిట్లను అందుబాటులో ఉంచుతున్నాం. వారి రక్షణ కోసం చర్యలు చేపడుతున్నాం.

ఆంధ్రజ్యోతి: ప్రస్తుతం మండలంలో చేపడుతున్న ఉపాధిహామీ పనులు ఏవి?

ఎంపీడీవో: మండలంలోని ఆయా గ్రామాల్లో నాటిన మొక్కల రక్షణ చర్యలు, గ్రావెల్ రోడ్డు నిర్మాణాలు, మొక్కలు నాటేందుకు గుంతల తవ్వకాలు పనులను చేపడుతున్నాం.

- జూలపల్లి

హనుమాన్ శోభాయాత్ర

మంథని, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి సందర్భంగా హనుమాన్ దీక్షాపరులు పట్టణ పురవీధుల్లో సోమవారం చేపట్టిన హనుమాన్ శోభాయాత్ర వైభవంగా సాగింది. ప్రత్యేకంగా అలంకరించిన రథంపై అయ్యప్పస్వామి ఆలయం నుంచి శోభాయాత్రను ప్రారంభించారు. డీజే సౌండ్స్ మధ్య భక్తిగీతాలకు నృత్యం చేశారు.

నేత్రదానం

ఓదెల, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన మంద చంద్రయ్య మృతి చెందగా అతడి నేత్రాలను సదాశయ ఫౌండేషన్ సేకరించింది. సోమవారం సంస్మరణ సభ నిర్వహించారు. సదాశయ ఫౌండేషన్ జాతీయ కార్యదర్శి మేర్గు భీష్మచారి మాట్లాడుతూ చంద్రయ్య నేత్రాలను దానం చేయడంతో మరో ఇద్దరు అంధులకు వెలుగులు ప్రసాదించారన్నారు. కుటుంబ సభ్యులను అభినందిస్తూ ప్రశంసపత్రాన్ని అందజేశారు. శ్రవన్‌కుమార్, లింగమూర్తి, రామకృష్ణారెడ్డి, మల్లేశం, సారంగం, వినోద్ పాల్గొన్నారు.

సన్నబియ్యంలో 5 కిలోలు కేంద్రానివే

ముత్తారం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): సన్న బియ్యం పంపిణీలో కేంద్ర ప్రభుత్వం ఐదు కిలోలు ఇస్తోందని బీజేపీ మండల అధ్యక్షుడు బిరుదు గట్టయ్య ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేవలం ఒక కిలో మాత్రమే ఇస్తుందని, ప్రచారం ఆరు కిలోలు ఇస్తున్నట్లు చేసుకుంటోందని తెలిపారు. దీనిని ప్రజలు గమనిస్తున్నారని, రాష్ట్రంలో రానున్నది బీజేపీ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు.

చలివేంద్రం ప్రారంభం

మంథని, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): వోపా ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో చలివేంద్రాన్ని ప్రారంభించారు. తంగళ్లపల్లి మధూకర్, కొమురోజు శ్రీనివాస్, మల్యాల రాజశేఖర్, కండక్టర్ సత్యనారాయణ, పురుషోత్తం, విజయ్, తిరుమల్లేష్, వేణు, సత్యనారాయణ, ప్రకాష్ పాల్గొన్నారు.

కౌలు రైతు కుటుంబానికి ఆర్థిక సాయం

మంథని, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మంథనికి చెందిన మండల రమేష్ అనే కౌలు రైతు 2017లో ఆత్మహత్యకు పాల్పడగా అతని కుటుంబానికి రూరల్ డెవలప్‌మెంట్ సర్వీస్ సొసైటీ, రైతు స్వరాజ్య వేదిక నిర్వాహకులు సోమవారం రూ.40 వేలు ఆర్థిక సహాయం అందించారు. రైతు స్వరాజ్య వేదిక రాష్ట్ర కమిటీ ప్రతినిధి కర్ణాటకపు సమ్మయ్య మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు రూ. 6 లక్షల పరిహారం అందించాలన్నారు.

మాతా శిశు మరణాల నియంత్రణకు కృషి



గర్రెపల్లి, ఎలిగేడులో ర్యాలీ నిర్వహిస్తున్న డాక్టర్లు, ఆరోగ్య సిబ్బంది, ధర్మారంలో అవగాహన కల్పిస్తున్న వైద్యురాలు

సుల్తానాబాద్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మాతా శిశు మరణాల నియంత్రణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక చర్యలు తీసుకుంటున్నాయని గర్రెపల్లి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఉదయ్‌కుమార్ అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం గర్రెపల్లిలో డాక్టర్లు, వైద్య ఆరోగ్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ ఉదయ్ కుమార్ మాట్లాడుతూ నవజాత శిశు మరణాలు, గర్భిణుల మరణాలు తగ్గించేందుకు అనేక చర్యలు తీసుకొంటున్నామన్నారు. గర్భిణీలు, బాలింతలు జాగ్రత్తలు తీసుకోవాలని, అందుబాటులో ఉన్న ఆరోగ్య కేంద్రాల్లో వివరాలను నమోదు చేయించుకోవాలన్నారు. మందులు పౌష్టికాహారం తీసుకునేలా బాధితులకు అవగాహన కల్పించాలని, రక్తహీనత, రక్తపోటు, మధుమేహం, క్షయ, పిండం ఎదుగుదల తదితర అంశాలను గమనించాలని వైద్య ఆరోగ్య సిబ్బందికి సూచించారు.

ముత్తారం, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని వైద్యాధికారి అమరేందర్ అధ్వర్యంలో నిర్వహించారు. ర్యాలీ అనంతరం మాట్లాడుతు ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని యేటా ఏప్రిల్ 7న జరుపుకుంటామన్నారు. మాతాశిశు సంరక్షణకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జ్యోతినగర్, (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ ధన్వంతరి ఆసుపత్రి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో హెల్త్‌వాక్‌ను నిర్వహించారు. ర్యాలీని ఎన్టీపీసీ ఈడీ చందన్ కుమార్ సామంత, దీప్తి మహిళా సమితి అధ్యక్షురాలు రాఖీ సామంత ప్రారంభించారు. ఈడీ మాట్లాడుతూ ఉద్యోగుల, వారి కుటుంబ సభ్యులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. రోజు క్రమం తప్పకుండా వ్యాయం, నడక చేయాలని సూచించారు. ఎన్టీపీసీ ఆసుపత్రిలో హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఐఎంఏ రామగుండం సభ్యురాలు డాక్టర్ లక్ష్మీవాణి, అపోలో రీచ్ కరీంనగర్ డైటీషియన్ డాక్టర్ దివ్యసాయి అవగాహన కల్పించారు. జీఎంలు, హెచ్‌వోడీలు, అధికారులు, ఉద్యోగులు, గృహిణులు పాల్గొన్నారు.

మంథనిరూరల్, (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని పలు గ్రామాల్లో గద్దలపల్లి పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు. సిరిపురం హెల్త్ సబ్ సెంటర్ వైద్య సిబ్బంది తల్లులు, నవజాత శిశువుల దీర్ఘకాలిక ఆరోగ్యాన్ని ప్రోత్సహించడానికి వివిధ వ్యాధులు, మానసిక ఆరోగ్య సమస్యలు, వాటి నివారణ గురించి ఎంఎల్‌హెచ్‌పీ శ్రీజ, ఏఎన్ఎం వీరమ్మలు ప్రజలకు అవగాహన కల్పించారు. ఎక్లాస్‌పూర్, మంథని సబ్ సెంటర్-2లో ఆరోగ్య సమస్యల నివారణపై అవగాహన కల్పించారు. ఎంఎల్ హెచ్‌పీలు శ్రావణి, జ్యోతి, సిబ్బంది పాల్గొన్నారు.

పాలకుర్తి, (ఆంధ్రజ్యోతి): పుట్నూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ సాయిసూర్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సూపర్‌వైజర్ జ్యోతి మాట్లాడుతూ థీమ్ ఆరోగ్యకరమైన ప్రారంభాలు, ఆశాజనకమైన భవిష్యత్తులు, నివారించదగిన మరణాలను తగ్గించడానికి, తల్లులు, నవజాత శివువుల దీర్ఘ కాలిక ఆరోగ్య సంరక్షణ ఆవశ్యకత గురించి అవగాహన కల్పించారు. ఏఎన్ఎంలు,ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఎలిగేడు, (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఆరోగ్య దినోత్సవం పురస్కరించుకొని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్‌చౌక్‌లో డాక్టర్ నిస్సి మాట్లాడుతూ లింగనిర్ధారణ, ఆడపిల్ల సంరక్షణ, అసంక్రమిత వ్యాధులు, మలేరియా, డెంగ్యూ, ఫైలేరియా తదితర వ్యాధుల నిర్మూలనపై అవగాహన కల్పించారు. పీహెచ్‌సీ వైద్యులు నిస్సిక్రిష్టాన, రత్నాకర్, జీపీ కార్యదర్శి అంజలి, సూపర్‌వైజర్‌లు నాగమణి, లక్ష్మణ్, ఏఎన్ఎం దేవేంద్ర పాల్గొన్నారు.

పెద్దపల్లిటౌన్, (ఆంధ్రజ్యోతి): మాతాశిశు ఆరోగ్యంపై సోమవారం నుంచి ఏడాదిపాటు అవగాహన కల్పిస్తామని డీఎంహెచ్‌వో ప్రసన్న కుమారి ఒక ప్రకటనలో తెలిపారు. మాతృ, శిశు మరణాలను అంతం చేయడానికి మహిళలు దీర్ఘకాలికంగా ఆరోగ్యంగా ఉండడానికి కృషి చేయాలని సూచించారు. తల్లులు, శిశువుల ఆరోగ్యం తద్వారా ఆరోగ్యకరమైన కుటుంబాలు, సమాజానికి పునాదని, అందరి ఆశాజనకమైన భవిష్యత్తు ఇవ్వడంలో సహాయపడుతుందన్నారు. రక్తహీనత, పౌష్టికాహార లోపం రాకుండా అవగాహన కల్పించి ఆరోగ్యవంతులు గా తీర్చిదిద్దడానికి కృషి చేయాలన్నారు.

ధర్మారం, (ఆంధ్రజ్యోతి) ప్రజలు సమతుల ఆహారం తీసుకొని, తగిన శారీరక శ్రమ చేస్తే రోగాల బారిన పడకుండా ఆరోగ్యంగా ఉండవచ్చని డాక్టర్ సుస్మిత అన్నారు. నంది మేడారం పీహెచ్‌సీలో ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రజలంతా వ్యక్తిగత శుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటిస్తూ సమతుల ఆహారం తీసుకోవాలని సూచించారు. ఏవైన అనుమానిత లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని, తద్వార వ్యాధులను త్వరగా నయం చేసేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఎంసిహెచ్‌పిలు ఏఎన్ఎంలు ప్రజలకు అవగాహన కల్పించారు.

కాల్వశ్రీరాంపూర్, (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరు ఆరోగ్యంపై దృష్టి సారించాలని డాక్టర్ దొమ్మటి శ్రీనివాస్ అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో సమావేశం ఏర్పాటు చేశారు. పిల్లలకు వ్యాక్సిన్లు, గర్భిణీలకు పౌష్టికాహారం, టీబీ, లెప్రసీ తదితర వ్యాధుల గురించి వివరించారు. ఆకుకూరలు, కూరగాయలు ఎక్కువగా తినడం వలన అనారోగ్యాలకు దూరంగా ఉంటామన్నారు. వ్యాయామం చేయడంవలన రోగాలు దరిచేరవన్నారు. డాక్టర్లు మహేందర్, సిరిచందన, సీహెచ్‌ఓ సరస్వతి, పీహెచ్ఎస్ భాగ్యలక్ష్మి, సూపర్‌వైజర్ నీరజ, పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలే లక్ష్యంగా పనిచేస్తున్న ప్రభుత్వం



అల్లీపూర్‌లో సన్నబియ్యం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు, ఖనిలో పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

సుల్తానాబాద్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథకాల అమలే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. అల్లీపూర్‌లో సోమవారం సన్న బియ్యం పథకం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి పేదలకు పంపిణీ చేశారు. సమావేశంలో ఆయన మాట్లాడుతు అప్పుల ఊబిలో ఉన్న రాష్ట్రాన్ని గాడిలో పెడుతూ సంక్షేమ పథకాల అమలు వైపు ముఖ్యమంత్రి తీసుకువెళుతున్నారన్నారు. అర్హులైన వారందరికీ త్వరలోనే రేషన్ కార్డులను జారీ చేస్తామని, అన్ని గ్రామాలలో ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణానికి మంజూరు ఇస్తామన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, మార్కెట్ చైర్మన్ మినుపాల ప్రకాశ్‌రావు, నాయకులు సోముల రాజిరెడ్డి, సాయిరి మహేందర్, ఎంపీడీఓ దివ్యదర్శన్ రావు పాల్గొన్నారు.

ధర్మారం, (ఆంధ్రజ్యోతి): నిరుపేదల కడుపు నింపేందుకే ప్రభుత్వం సన్న బియ్యం కార్యక్రమం చేపట్టిందని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ లావుడ్య రూప్లానాయక్ అన్నారు. సోమవారం మండలంలోని రామయ్యపల్లిలో వైస్ చైర్మన్ అరిగె లింగయ్యతో కలిసి లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ చేశారు. పోలుదాసరి సంతోష్, పంజాల లత శ్రీనివాస్, అల్వాల రాజేశం, రాములు, మల్లయ్య, తిరుపతి, పాల్గొన్నారు.

కోల్‌సిటీటౌన్, (ఆంధ్రజ్యోతి): ప్రజల సంక్షేమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని రామగుండం కార్పొరేషన్ అధ్యక్షుడు బొంతల రాజేష్ అన్నారు. 28వ డివిజన్ విద్యానగర్‌లో సన్నబియ్యం కార్యక్రమాన్ని డివిజన్ కాంగ్రెస్ నాయకుల చేతుల మీదుగా పంపిణీ చేశారు. రాజేష్ మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటి అమలు చేస్తుందన్నారు. ఎస్సీ సెల్ అధ్యక్షుడు యుగేందర్, డివిజన్ అధ్యక్షుడు మహేష్‌గౌడ్, పెరుక తిరుపతి, నగేష్, సంపత్, బబ్బీ, అక్రు, పాల్గొన్నారు.

లద్నాపూర్‌లో కంటి వైద్య శిబిరం



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

రామగిరి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని లద్నాపూర్‌లో లయన్స్‌క్లబ్ సెంటినరీకాలనీ ఆధ్వర్యంలో రేకుర్తి కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో సోమవారం ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. మాజీ ఎంపీటీసీ వనంరాంచందర్‌రావు, మంథని అసెంబ్లీ యూత్ కన్వీనర్ బర్లశ్రీనివాస్ సౌజన్యంతో కంటి వైద్య పరీక్షలు జరిగాయి. వైద్య పరీక్షల్లో 103 మందికి లయన్స్‌క్లబ్ డైరెక్టర్ శరణ్య, టెక్నీషియన్ ప్రభాకర్ ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించి 28 మందిని ఆపరేషన్‌కు ఎంపిక చేశారు. ఏఎస్ఐ స్వామి, రేకుర్తి కంటి ఆసుపత్రి చైర్మన్ కొండవేణుమూర్తి, వైస్‌చైర్మన్ చిదుర సురేష్, క్లబ్ అధ్యక్షుడు శ్రీనివాస్, డైరెక్టర్ వెంకటరమణరెడ్డి, కార్యదర్శి అబ్బుకేశవరెడ్డి, ఉపాధ్యక్షుడు కళాధర్‌రెడ్డి, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ఏఐ బోధన

5వ పేజీ తరువాయి

ఏఐలో ఎక్స్టెప్ ఫ్లో ఫౌండేషన్ ఏఐ లెర్నింగ్ టూల్స్ అసిస్టెడ్ లాంగ్వేజ్ లెర్నింగ్ (ఏఎల్ఎల్), అసిస్టెడ్ మ్యాథమెటిక్ లెర్నింగ్ (ఏఎంఎల్) ఇన్‌స్టాల్ చేశారు. ఎఫ్ఎల్ఎన్ ద్వారా నేర్చుకున్న అంశాలను కంప్యూటర్ ముందు తప్పుగా చదివితే లోపాలను గుర్తిస్తుంది. ప్రధానంగా 3, 4, 5వ తరగతి చదువుతున్న విద్యార్థుల్లో చదువుల్లో వెనకబడిన వారిలో విద్యార్థుల సంఖ్యకనుగుణంగా 5, 10, 15 మందిని ఒక్కో బ్యాచ్‌గా విభజించారు. ఒక్కో బ్యాచ్‌కు తెలుగు, గణిత అభ్యాసాలపై 20, 40 నిమిషాల పాటు కృత్రిమ మేథ పాఠ్యాంశాల బోధన చేస్తున్నారు. అభ్యాసానికి సంబంధించిన అంశాల్లో 70 శాతానికి పైగా సరైన సమాధానాలు సాధిస్తేనే మరో పాఠ్యాంశం నేర్చుకునేందుకు అవకాశం ఉంటుంది. అంతకంటే తక్కువగా మార్కులు వస్తే ఆ పాఠ్యాంశాన్ని మరోసారి అభ్యాసం చేయాల్సి ఉంటుంది. ఏఐ విద్యాబోధనను ఏక్-స్టెప్ సంస్థ పర్యవేక్షించి లోపాలను సరిదిద్దుతుంది. అలాగే ఏఐ ద్వారా వచ్చే ఫలితాలపై నివేదిక రూపొందించి ప్రభుత్వానికి అందించనున్నది.

వృద్ధులకు దీప్తి మహిళా సమితి చేయూత



వృద్ధులకు సామగ్రి అందజేస్తున్న డీఎంఎస్ సభ్యులు

జ్యోతినగర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీపీసీ ప్రభావిత ప్రాంతం వీర్లపల్లిలోని వృద్ధులకు ఎన్టీపీసీ దీప్తి మహిళా సమితి(డీఎంఎస్) చేయూతనందించింది. సోమవారం ఈశ్వర కృప వృద్ధాశ్రమంలోని వృద్ధులకు దీప్తి మహిళా సమితి అధ్యక్షురాలు రాఖీ సామంత ఆధ్వర్యంలో పరుపులు, దుప్పట్లు, దిండ్లు, తినుబండారాలు, ఇతర ఉపకరణాలను పంపిణీచేశారు. మహిళాభ్యుదయానికి కృషి చేయడంతోపాటు స్వచ్ఛంద కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని అధ్యక్షురాలు రాఖీ సామంత అన్నారు. ఉపాధ్యక్షురాలు జ్యోత్స్న త్రిపాఠి, బాల్ భవన్ ఇన్‌చార్జి రూప సింగరాయ, సభ్యులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో తాగునీటి వసతి కల్పించాలి



మాట్లాడుతున్న ఎంఈవో రమేష్

ఓదెల, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : వేసవికాలం దృష్ట్యా పాఠశాలల్లో తాగునీటి వసతి కల్పించాలని ఎంఈవో రమేష్ తెలిపారు. సోమవారం ఓదెల ఉన్నత పాఠశాలల్లో మండలంలోని పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశాన్ని నిర్వహించారు. ఎంఈవో రమేష్ మాటాడుతూ 2025-26 సంవత్సరానికి గాను మే 29 వరకు విద్యార్థుల యూనిఫాం అందించే విధంగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. దీంతోపాటు పాఠశాలల ప్రోగ్రెసివ్ రిపోర్టును అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీవో తిరుపతి, ఏపీఎం లతా మంగేశ్వరి పాల్గొన్నారు.

అంబులెన్స్ ప్రారంభం

మంథని, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): శ్రీసీతారామ సేవా సదన్ ఆధ్వర్యంలో జగిత్యాల జిల్లా ధర్మపురి ప్రజలకు ఉచిత అంబులెన్స్ సేవలను అధ్యక్షుడు కేవీఎల్ఎన్ హరిబాబు సోమవారం ప్రారంభించారు. ధర్మపురి శ్రీగాయతి నిత్యాన్నదాన సత్రం, బ్రాహ్మణ సేవా సంఘం అభ్యర్థన మేరకు సేవలను ప్రారంభించారు. ఉపాధ్యక్షుడు గణపతి, కోశాధికారి అంబరీష్ రావు, సంయుక్తకార్యదర్శి ప్రహ్లాద్, సభ్యులు సువర్ణ మహదేవ్, గట్టు ప్రదీప్, న్యాయవాది శశిభూషణ్‌కాచేలు పాల్గొన్నారు.

అంబేడ్కర్ జయంత్యుత్సవ కమిటీ

ఎలిగేడు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): దళిత సంఘాల ఆధ్వర్యంలో సోమవారం అంబేడ్కర్ జయంతి ఉత్సవాల నిర్వహణకు మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కవ్వంపల్లి చంద్రయ్య, ఉపాధ్యక్షులుగా సదానందం, మహేందర్, కార్యదర్శులుగా జల్లి రమేష్, బానంపల్లి సర్వేశం, సంయుక్త కార్యదర్శి శంకర్, ప్రచార కార్యదర్శులుగా కాంపల్లి రమేష్, ఆసంపల్లి శ్రీనివాస్, రాచర్ల అనిల్, కప్పల సాయిలు, చెవుల అజయ్, కార్యవర్గ సభ్యులుగా పొన్నం మనోజ్, ఇరుకుల సచిన్(రవి), బొమ్మ ఓంప్రకాశ్, వడ్లూరి శ్రీనివాస్, న్యాతరి శంకర్, ఎన్నికైనట్లు నిర్వాహకులు తెలిపారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ముత్తారం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్త ఇనుముల సదానందం తల్లి మృతి చెందగా మంత్రి శ్రీధర్‌బాబు ఆదేశాల మేరకు బాధిత కుటుంబానికి 50 కిలోల బియ్యం అందజేశారు మాజీ సర్పంచ్ రజితరఫీ, పరానంది ధనలక్ష్మి, నాయకులు జక్కుల రమేష్, రామస్వామి, వెంకటస్వామి, గోపి, సంజీవరెడ్డి, విద్యాసాగర్, పాల్గొన్నారు.

తాగునీటి సమస్య లేకుండా చర్యలు చేపట్టాలి



కార్యదర్శులతో మాట్లాడుతున్న ఎంపీడీవో కె.శ్రీనివాస్

పెద్దపల్లి రూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో వేసవికాలం దృష్ట్యా తాగు నీటి సమస్య లేకుండా చర్యలు చేపట్టాలని ఎంపీ డీవో కొప్పుల శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఎంపి డివో శ్రీనివాస్ మాట్లాడుతూ ఉపాధిహామీ పనులు వేగవంతం చేయాలని, అర్హులైన ప్రతీ ఒక్కరికి పనులు కల్పించాలని సూచించారు. నిమ్మనపల్లిలో చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసే విధంగా కార్యదర్శి నిరంతరం పర్యవేక్షించాలన్నారు. గ్రామాల్లో పరిశుభ్రత, పారిశుధ్యం పనులు చేపట్టాలని, వేసవికాలం దృష్ట్యా గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాల్లో నీరు ఉండే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. కార్యదర్శులు పాల్గొన్నారు.

రేషన్ దుకాణాల్లో మోదీ ఫోటో పెట్టాలి

యైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): రేషన్ దుకాణాల్లో ప్రధాని నరేంద్రమోదీ ఫోటో పెట్టాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. 18వ డివిజన్‌లోని రేషన్ షాప్‌ను సోమవారం సందర్శించారు. దళిత మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసిపేట శివాజీ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం గరీబ్ కళ్యాణ్ అన్న యోజన కింద బియ్యాన్ని అందజేస్తున్నట్టు తెలిపారు. ఆరు కిలోలలో ఐదు కిలోలు కేంద్ర ప్రభుత్వం ఇస్తుండగా, రాష్ట్ర ప్రభుత్వ వాటా కిలో బియ్యం అని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ తామే ఇచ్చినట్టు ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటన్నారు. మూకిరి రాజు, ఆకుల శశికుమార్, శ్రీనివాస్, వెంకటి, కుమార్, పాల్గొన్నారు.

రాజీవ్ యువ వికాసం సద్వినియోగం చేసుకోవాలి

కోల్‌సిటీటౌన్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువ వికాసం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఇంటర్ డినామినేషనల్ పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు పాస్టర్ ఎం.మహిపాల్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి పాస్టర్ పి.డిలైట్ కోరారు. సోమవారం మాట్లాడుతూ తెలంగాణ క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా క్రైస్తవ మైనార్టీ యువతకు స్వయం ఉపాధి అవకాశాలను కల్పిస్తుందన్నారు. ఈనెల 14లోపు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. బి.రవిపాల్, పాస్టర్ జె.ప్రజార్శి, పాస్టర్ డి.గ్రాబియేల్, పాస్టర్ రవివర్మ, థామస్, చందర్‌పాల్, ప్రభాకర్ పాల్గొన్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



గ్రాడ్యుయేషన్ డే వేడుకలో సర్టిఫికెట్లతో విద్యార్థులు

కోల్‌సిటీటౌన్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని చంద్రశేఖర్‌నగర్‌లోని గుడ్‌మార్నింగ్ గ్రామర్ స్కూల్ ఆవరణలో క్రీడా-సాంస్కృతిక దినోత్సవం, గ్రాడ్యుయేషన్ డే వేడుకలు సోమవారం నిర్వహించారు. జిల్లా ట్రస్మా గౌరవ అధ్యక్షుడు పరిపాటి అంజారెడ్డి, అధ్యక్షుడు కంది రవీందర్‌రెడ్డి హాజరై వేడుకలను ప్రారంభించారు. యూకేజీ నుంచి 5వ తరగతి విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లను అతిథులు అందజేశారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కరస్పాండెంట్ అదర్‌సండే సమ్మారావు, ట్రస్మా రాష్ట్ర ఉపాధ్యక్షుడు యాదగిరిగౌడ్, డైరెక్టర్ సమ్మిరెడ్డి, ప్రిన్సిపాల్ తిరుపతిరెడ్డి, మేజిక్ రాజా, ఉపాధ్యాయులు, పోషకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

కోల్‌సిటీ, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని రామగుండం కార్పొరేషన్ కమిషనర్ జే అరుణ శ్రీ అన్నారు. ఇటీవల మరణించిన మున్సిపల్ పారిశుధ్య కార్మికుడు కొట్టె ప్రసాద్ కుటుంబానికి ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన పథకం కింద ఎస్‌బిఐ లైఫ్ బీమా సంస్థ జారీ చేసిన రూ.2లక్షల చెక్కును సోమవారం అందజేశారు. కమిషనర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలవుతున్న బీమా పథకాలలో కార్మికులు, ఆర్పీలు ప్రతి ఒక్కరూ చేరాలన్నారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ మేనేజర్ రవీందర్‌సింగ్, బ్రాంచ్ మేనేజర్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ఏడాదికి రూ.436 చెల్లిస్తే రూ.2లక్షల బీమాతో పాటు మరో రూ.20అదనంగా చెల్లిస్తే రూ.2 లక్షల ప్రమాద బీమా కూడా వర్తిస్తుందని తెలిపారు. డిప్యూటీ కమిషనర్ వెంకట స్వామి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కుమార స్వామి, సిబ్బంది వసుధ, శంకర్, కార్మిక సంఘం మురళీధర్‌రావు, లింగయ్య, రాయమల్లు, రాజేందర్ పాల్గొన్నారు.

50 మినీ చెరువుల నిర్మాణానికి ప్రణాళిక



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న సీఎండీ బలరామ్

గోదావరిఖని, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): సింగరేణి వ్యాప్తంగా 50 మినీ చెరువుల ఏర్పాటుకు ప్రణాళిక రూపొందించినట్లు సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ అన్నారు. సోమవారం అన్ని ఏరియాల జీఎంలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. సింగరేణి నీటి బిందువు-జల సింధువు కార్యక్రమాన్ని చేపట్టాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. సీఎండీ బలరామ్ మాట్లాడుతూ సింగరేణి ప్రాంతంలో భూగర్భ జలాలను పెంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సింగరేణి ఓపెన్ కాస్ట్ గనుల్లో ఇప్పటికే బొగ్గు తవ్వగా ఏర్పడిన ఖాళీ సంపుల్లో నీటి శాతాన్ని పెంచాలని, తద్వారా సమీప ప్రాంతాల్లో వాటర్ టేబుల్ (నీటిఫలకం)ను వృద్ధి చేయాలని నిర్ణయించారు.ఓపెన్ కాస్ట్ గనుల ఓవర్ బర్డెన్ డంపుల మధ్య ఏర్పడే లోతట్టు ఖాళీ ప్రదేశాల్లో వర్షపు నీటితో, లేదా ఓపెన్ కాస్ట్ నుంచి బయ టకు పంపించే నీటితో నింపాలన్నారు. గని ప్రాంతాలకు వెలుపల 2 కిలోమీటర్ల పరిధిలో ఉన్న చెరువులు, కుంటలను కూడా అభివృద్ధి చేయాలని, వాటిలో ఎక్కువ నీరు నిలువ ఉంచేందుకు పూడిక తీయడం వంటి పనులు చేపట్టాలని నిర్ణయించారు. డైరెక్టర్లు సత్యనారాయణరావు (ఈఅండ్ఎం), ఎల్వీ సూర్యనారాయణ (ఆపరేషన్స్), కె.వెంకటేశ్వర్లు (పా,పీపీ), ఈడీ (కోల్ మూమెంట్) ఎస్‌డీ ఎం సుభానీ, ఫారెస్ట్ అడ్వయిజర్ మోహన్ పరిగెన్ పాల్గొన్నారు.



ఎడ్యుకేషన్ విత్ డెడికేషన్ నినాదంతో బోధించాలి

గోదావరిఖని ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ఎడ్యుకేషన్ విత్ డెడికేషన్ నినాదంతో బోధించాలని సింగరేణి సీఎండీ ఎన్ బలరామ్ అన్నారు. సింగరేణి ఎడ్యుకేషనల్ సొసైటీ సెక్రెటరీ జి.శ్రీనివాస్ సోమవారం సీఎండీని కలిశారు. సింగరేణి పాలిటెక్నిక్ 17వార్షిక దినోత్సవ జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ పాఠశాలలు, కళాశాలలు పవిత్ర దేవాలయాలు అన్నారు. ఎడ్యుకేషన్ విత్ డెడికేషన్ నినాదంతో బోధన, బోధనేతర సిబ్బంది తమ విధులను నిర్వర్తించాలన్నారు. ఉపాధ్యాయులు ప్రతీ విద్యార్థిని వారి పిల్లలుగా భావించాలన్నారు. క్రీడలకు ప్రోత్సాహం అందించాలన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో సమస్యలు పరిష్కరిస్తాం

యైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో సింగరేణి కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని ఐఎన్‌టీయూసీ ఆర్జీ-2 వైస్ ప్రెసిడెంట్ శంకర్‌నాయక్ అన్నారు. సోమవారం ఓసీపీ-3 ఎస్అండ్‌డీ సెక్షన్‌ను సందర్శించారు. సెక్షన్‌లో సమస్యలను హెచ్ ఓడీ దృష్టికి తీసుకెళ్లారు. సెంట్రల్ కమిటీ నాయకులు అక్రం, సత్యనారాయణ రెడ్డి, దశరథం, సంపత్‌రెడ్డి ప్రాజెక్టు పిట్ సెక్రెటరీ రవీందర్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలను పట్టించుకోకపోవడం బాధ్యతారాహిత్యం

యైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): కోల్‌కారిడార్ రోడ్డుపై తరచూ ప్రమాదాలు జరుగుతున్నా యాజమాన్యం పట్టించుకోకపోవడం బాధ్యతారాహిత్యమని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి పేర్కొన్నారు. సోమవారం యూనియన్ నాయకులతో కలిసి సీహెచ్‌పీ నుంచి సెంటినరీకాలనీ వరకు రోడ్డును పరిశీలించారు. రోడ్డు స్థితిని కార్మికులు యూనియన్ దృష్టికి తీసుకురాగా పరిశీలించినట్లు తెలిపారు. సీహెచ్‌పీ నుంచి సెంటినరీ కాలనీ వరకు రోడ్డు గతుకులతో ఉందని, ఈరోడ్డుపై అనేక ప్రమాదాలు జరిగాయని తెలిపారు. వాహన సీహెచ్‌పీ నుంచి వెలువడే దుమ్ము, పొగతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సమావేశంలో ఆర్జీ-2 బ్రాంచి సెక్రెటరీ కుంట ప్రవీణ్ కుమార్, ప్రెసిడెంట్ బానోతు వినయ్, వైస్ ప్రెసిడెంట్ వెంకన్న, నాయకులు ఉన్నారు.



రోడ్డును పరిశీలిస్తున్న సీఐటీయూ నాయకులు